

స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర మిషన్‌లో

ర్యాంకు ఎంత..

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర మిషన్‌లో భాగంగా తూర్పుగోదావరి జిల్లాకు మూడో ర్యాంకు వచ్చింది. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ విషయాన్ని రాజధానిలో శుక్రవారం స్వయంగా ప్రకటించారు. జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి నేతృత్వంలో స్వచ్ఛాంధ్ర కోసం ప్రత్యేక కృషి చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో జిల్లాకు మూడో ర్యాంకు లభించడంతో అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, ప్రజల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఈ మిషన్‌లో భాగంగా పట్టణాభివృద్ధిశాఖ, పంచాయతీరాజ్‌శాఖ 14 ఇండికేటర్స్‌తో పెట్టుకున్న లక్ష్యాలను అధికారులు సీఎం చంద్రబాబుకు అందజేశారు. అందులో పట్టణాభివృద్ధిశాఖ పరిధిలో డోర్ టు డోర్ కలెక్షన్‌కు 15

ర్యాంకు : 3 | పాయింట్లు 125/200

'తూర్పు'లో భేష్!

జిల్లా కలెక్టర్ ప్రశాంతి కృషికి ఫలితం

పాయింట్లు, సోర్స్ సెగ్రిగేషన్‌కు 35 పాయింట్లు, సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్‌కు 20 పాయింట్లు, లెగసీ వేస్ట్ క్లియరెన్స్‌కు 10 పాయింట్లు, లిక్విడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌కు 20 పాయింట్లు ఇచ్చారు. పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణానికి 15 పాయింట్లు, పబ్లిక్ టాయిలెట్లకు 10, కమ్యూనిటీ సోక్‌పిట్స్‌కు 10 పాయింట్లు, 100 శాతం డోర్‌టు డోర్ చెత్త సేకరణకు 10, ఓడీఎఫ్ ప్లస్ మోడల్ విలేజీకి 20 పాట్లు వంతున మొత్తం 200 పాయింట్ల ఆధారంగా జిల్లా ప్రోగ్రెస్‌పై ర్యాంకులు ఇచ్చారు. అందులో 125 పాయింట్లతో జిల్లాకు 3వ ర్యాంకు లభించింది. జిల్లా పంచాయతీ అధికారి వి.శాంతామణి జిల్లాకు మూడో ర్యాంకు లభించడం పట్ల హర్షం వ్యక్తంచేశారు. జిల్లాలోని 299 గ్రామాల్లో ప్రతీరోజూ పారిశుధ్యం, నీటి సరఫరా తదితర అంశాలపై ఎప్పటికప్పుడు ఫోటోలు తీసి పీఆర్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నామన్నారు. జిల్లాలో 299 గ్రామాలకుగానూ 268 చోట్ల సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ పనులు జరుగుతున్నాయని, కొన్ని షెడ్లకు సమస్య ఉన్నా, వాటి పరిష్కారానికి దృష్టి పెట్టామని చెప్పారు.

ర్యాంకు : 14 | పాయింట్లు 109/200

కాకినాడకు నిరాశ!

కాకినాడ /కాకినాడ సిటీ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర మిషన్‌లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన జిల్లాల ర్యాంకింగ్‌లో కాకినాడ వెనుకబడింది. పరిశుభ్రతా ప్రమాణాలు పాటించడంలో మంచిపని తీరు కనబరచలేక 14వ ర్యాంకులో నిలిచింది. పంచాయతీరాజ్, పట్టణాభివృద్ధిశాఖలు కలిపి వివిధ అంశాలపై మొత్తం 14 విభాగాల్లో రేటింగ్ ఇవ్వగా 200 పాయింట్లకుగాను 109 పాయింట్లు మాత్రమే సాధించింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లా పరిధిలో గ్రామాలు, పట్టణాల్లో పరిశుభ్రత పెంచేందుకు ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర పేరుతో ఈ ప్రత్యేక కార్యక్రమం అమలు చేస్తోంది. ఇదిలా ఉండగా ఈనెల 3వ శనివారం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా సోర్స్ రీసోర్స్ అంశాన్ని థీమ్‌గా తీసుకున్నారు. ఇందులో భాగంగా మన మూలాలు- మన బలాలు తెలుసుకుని రాష్ట్రంలోని వనరులను ఏ విధంగా సద్వినియోగం చేసుకుని అభివృద్ధి సాధించాలనే దానిపై దృష్టి పెట్టాలని సీఎం చంద్రబాబు అధికారులకు దిశానిర్దేశం చేశారు. దీనికింద జీవన ప్రమాణాలు పెంచడం, పర్యాటక రంగానికి ప్రోత్సాహం, పెట్టుబడులు ఆకట్టుకోవడం, సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను చేరుకోవడం, నెట్ జీరోకు పర్యావరణాన్ని తీసుకురావడం, సంపూర్ణ స్వచ్ఛత వైపు అడుగులు వేయడం వంటి లక్ష్యాలను చేరుకోవాలని ఆదేశించారు.

ర్యాంకు : 17 | పాయింట్లు 105/200

కోనసీమ వెనకడుగు

అమలాపురం(ఆంధ్రజ్యోతి), ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛాంధ్ర లక్ష్యాల సాధనలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు 17వ స్థానంలో నిలిచి ర్యాంకుల సాధనలో వెనకబడిపోయింది. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల్లో కోనసీమ జిల్లా మొత్తం 200 పాయింట్లకుగాను 105 పాయింట్లతో సరిపెట్టుకుంది. జిల్లాలకు 14 ఇండికేటర్స్‌ను పెట్టుకుని వాటిలో అంశాల సాధనలో ముందంజలో ఉన్న జిల్లాలవారీగా ఈ ర్యాంకులు ప్రకటించారు. ముఖ్యంగా స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రలో భాగంగా పట్టణాభివృద్ధిశాఖ, పంచాయతీరాజ్‌శాఖలు చేపట్టిన కార్యక్రమాలపై సీఎం చంద్రబాబునాయుడు ఈ మేరకు సమీక్షించారు. ప్రతీ నెల 3వ శనివారం ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా నిర్వహిస్తోంది. ప్రతీ నెల ఒక థీమ్ తీసుకుని ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జనవరి నెలలో న్యూఇయర్ క్లీన్ స్టార్ట్ అనే అంశాన్ని థీమ్‌గా తీసుకోగా, ఫిబ్రవరిలో సోర్స్ రిసోర్స్ అనే అంశాన్ని థీమ్‌గా తీసుకున్నారు. జిల్లా వెనుకబడిపోవడం చర్చనీయాంశంగా మారింది.

ర్యాంకు : 25 | పాయింట్లు 81/200

అల్లూరి జిల్లాలో అధ్వానం!

రంపచోడవరం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛాంధ్ర మిషన్‌లో భాగంగా ప్రకటించిన ర్యాంకుల్లో చిట్టచివరి స్థానంలో అల్లూరి సీతారామరాజు జిల్లా నిలవడంతో జిల్లా ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. జిల్లా ప్రగతిపై సంబంధిత అధికారులు సరైన దృష్టి పెట్టకపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ జిల్లా మొత్తం 200 పాయింట్లకుగాను 81 పాయింట్లతో చివరి 25 స్థానం పొందింది. రాష్ట్రంలో మొదటి స్థానాన్ని 200 పాయింట్లకుగాను 129 పాయింట్లతో ఎన్టీఆర్ జిల్లా నిలిచింది.

నేటి నుంచి హాకీ టోర్నమెంట్

- కాకినాడ వేదికగా ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్
- అతిపెద్ద క్రీడా సంబరానికి సర్వం సిద్ధం 6
- 18 రాష్ట్రాల నుంచి పాల్గొంటున్న 43టీంలు
- వెయ్యిమంది క్రీడాకారులు, వందమంది కోచ్‌లు రాక
- క్రీడాకారులతో నిండిపోయిన కాకినాడలోని హోటళ్లు
- నేటినుంచి 28 వరకు రెండు వారాలపాటు క్రీడా సంబరాలు
- అతిథులుగా రానున్న అర్జున, ఖేల్ రత్న అవార్డు గ్రహీతలు



కాకినాడలోని జిల్లా క్రీడా మైదానంలో హాకీ టోర్నమెంట్‌కు సిద్ధమవుతున్న క్రీడాకారులు

మహోన్నత వ్యక్తి దామోదరం సంజీవయ్య

- జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్
- కలెక్టరేట్‌లో సంజీవయ్య 104వ జయంతోత్సవం



దామోదరం సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రెండో ముఖ్యమంత్రిగా, తొలి దళిత ముఖ్యమంత్రిగా అనేకమైన నూతన సంస్కరణలకు నాంది పలికిన గొప్ప మహోన్నత వ్యక్తి దామోదరం సంజీవయ్య అని జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అన్నారు. కాకినాడ కలెక్టరేట్‌లో సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సంజీవయ్య 104వ జయంతోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ప్రభుత్వ సంస్థల నిర్మాణంలో పలు సంక్షేమ పథకాల అమలులో దామోదరం సంజీవయ్య చేసిన కృషి చిరస్మరణీయమైనదన్నారు. నిరంతరం ప్రజల క్షేమానికి పాటుపడిన ఆయన నిజాయితీగా, విలువలతో కూడిన పరిపాలన అందించారన్నారు. ఆయనలోని సేవా దృక్పథం, ఉన్నత వ్యక్తిత్వం, మేధా సంపత్తి, రాజనీతిజ్ఞత అనతికాలంలోనే ఆయన్ను ఉన్నతస్థాయికి తీసుకువెళ్లాయన్నారు. కేంద్రమంత్రిగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రెండో ముఖ్యమంత్రిగా అనేకమైన నూతన సంస్కరణలకు నాంది పలికారన్నారు. కార్యక్రమంలో జేసీ రాహుల్‌మీనా, డీఆర్వో వెంకట్రావు, హౌసింగ్ పీడీ సత్యనారాయణ, జడ్పీ సీఈవో లక్ష్మణరావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సత్యవతి, బీసీ సంక్షేమ అధికారి లల్లి, సహాయ సాంఘిక సంక్షేమ అధికారులు వాణి, రాధ, కలెక్టరేట్ ఏవో రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న ఎస్పీ బిందుమాధవ్

ఎస్పీ బిందుమాధవ్ రక్తదానం

- రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా కాకినాడలో రక్తదాన శిబిరం ఏర్పాటు

కాకినాడ క్రైం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఒకరు చేసే రక్తదానం మరో నలుగురికి ప్రాణదానమని ఎస్పీ జి.బిందుమాధవ్ అన్నారు.రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా కాకినాడ లారీ ఓనర్స్ అసోసియేషన్ భవనంలో శుక్రవారం ప్రత్యేక రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఎస్పీతోపాటు ఐపీఎస్ అధికారి మనీష్ దువరాజ్ పాటిల్‌తోపాటు మరో 90మంది రక్తదానం చేశారు.

జీబీఎస్.. బీ అలెర్ట్

- రోగ నిరోధక శక్తిని నశింపజేస్తున్న సిండ్రోమ్
- కాకినాడ జీజీహెచ్‌లో నాలుగు కేసుల నమోదు



జీబీఎస్(గులియన్ బర్రే సింద్రోమ్).. అనేది ఓ అరుదైన న్యూరో వ్యాధి.. లక్షల్లో ఒకరికి కనిపిస్తుంది. ఈ వ్యాధి బారిన పడినవారికి కండరాలు బలహీనమవుతాయి. నాడీ వ్యవస్థ మీద ఇది ప్రభావం చూపుతుంది. ప్రస్తుతం ఈ వ్యాధి బారిన పడి పలువురు ఆస్పత్రుల్లో చేరుతున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని కాకినాడ జీజీహెచ్‌లో తాజాగా నాలుగు కేసులు నమోదయ్యాయి. ఇది ప్రాణాంతకం కాదని, సరైన చికిత్స ద్వారా నయం చేయవచ్చని వైద్యులు చెప్తున్నారు. 6

ఎమ్మెల్సీ ఎన్నికల కాకినాడ పార్లమెంట్ జనసేన సమన్వయకర్తగా రామస్వామి

కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కాకినాడ పార్లమెంట్ జనసేన సమన్వయకర్తగా ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు తుమ్మల రామస్వామిని నియమించారు. ఈ మేరకు డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ఉత్తర్వులు ఇచ్చారు. ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎన్నికల్లో కూటమి అభ్యర్థిని గెలిపించే దిశగా పార్టీశ్రేణులు, కూటమి నేతలతో సమన్వయం చేసుకోవాలని ఆయన సూచించారు.

నో.. ఫైవ్ స్టార్



5.0 ★★★★★ | 0.0 ★★★★★

- స్టార్ రేటింగ్‌లో వెనుకబడిన ప్రభుత్వ పాఠశాలలు
- గత వైసీపీ ప్రభుత్వ వైఫల్యంతో ఈ పరిస్థితి
- జిల్లాలో పది పాఠశాలలకు సున్నా రేటింగ్

కాకినాడరూరల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): విద్యా వ్యవస్థలో మార్పులు, సంస్కరణల పేరుతో గత వైసీపీ ప్రభుత్వం చేపట్టిన విధానాలు ప్రభుత్వ పాఠశాలలను దీనస్థితిలోకి నెట్టాయి. విద్యార్థుల చదువులను గాలికొదిలేసి బైజూస్, టోఫెల్, సీబీఎస్ఈ అంతర్జాతీయ సిలబస్ అంటూ చేసిన ప్రయోగాలు విద్యాప్రమాణాలను దెబ్బతీశాయి. ఉపాధ్యాయులకు బోధనేతర బాధ్యతలు అప్పగించడంతో విద్యార్థుల చదువులు అటకెక్కాయి. చాలా పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కరువవడంతోపాటు కొంత మంది విద్యార్థుల్లో అభ్యసనా సామర్థ్యాలు తగ్గాయి. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం కలెక్టర్ల సదస్సులో వెల్లడించిన నివేదికలో ఈ వాస్తవాలు వెలుగుచూశాయి. దీని ప్రకారం జిల్లాలోని ఏ ఒక్క పాఠశాలకూ ఫైవ్ స్టార్ రేటింగ్ దక్కకపోవడం గమనార్హమని పలువురు విద్యావేత్తలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

● జిల్లాలో ఇదీ పరిస్థితి

కాకినాడ జిల్లాలో 1280 ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలకు 18, అభ్యసన సామర్థ్యాలకు 14 సూచికలను ప్రామాణికంగా తీసుకుని వాటికి రేటింగ్ ఇవ్వగా రాష్ట్రంలో జిల్లా విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలోను, మౌలిక సదుపాయాలపరంగాను మెరుగైన స్థానంలో నిల్వలేదు. జిల్లాలోని ఏ పాఠశాలకు ఫైవ్ స్టార్ రేటింగ్ దక్కకపోవడం శోచనీయం.

● అభ్యసనంలో..

అకడమిక్‌పరంగా విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, గతేడాది 10వ తరగతి ఫలితాలు, ఇటీవల నిర్వహించిన సమ్మేటివ్ అసెస్‌మెంట్ ఫలితాలు ఆధారంగా ఇచ్చారు. ఈ నాలుగు విభాగాల్లో హాజరుకు 40శాతం, ఫలితాలకు 60శాతం రెండూ కలిపి 90శాతం దాటిన పాఠశాలలకు ఫైవ్‌స్టార్ రేటింగ్ ఇచ్చారు. అంతకంటే తక్కువ ఫలితాలున్న పాఠశాలలకు 1 నుంచి 4 స్టార్లు కేటాయించారు. జిల్లాలో 67 పాఠశాలలు 3 స్టార్లు, 707 పాఠశాలలు 2 స్టార్లు, 496 పాఠశాలలకు ఒక స్టార్ రాగా, సున్నా స్టార్ రేటింగ్ పాఠశాలలు 10 ఉన్నాయంటే గత వైసీపీ ప్రభుత్వ విధానాలను ఎంతమేర ప్రభావితం చూపాయో అర్థం చేసుకోవచ్చు.

● ఫలితాలను గాలికొదిలేశారు

గత ప్రభుత్వం పాఠశాలలను ప్రచారానికి పూర్తిస్థాయిలో వాడుకుంది. విద్యార్థుల హాజరు, వారి పరీక్షల ఫలితాలను గాలికొదిలేసింది. ఉపాధ్యాయులకు మరుగుదొడ్ల ఫోటోల బాధ్యతలు అప్పగించి బోధన సమయాన్ని తగ్గించింది. ఈ సమస్యపై అప్పట్లో ఉపాధ్యాయులు గగ్గోలుపెట్టినా పట్టించుకోలేదు. పాఠశాలవిద్య అంటే నాడు-నేడు పథకం ఒక్కటే నా అన్నట్లు మార్చేసి ఫలితాలను దిగజార్చిందని పలువురు విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

● మౌలిక సదుపాయాల్లో..

మూడు, నాలుగు తరగతి గదుల్లో అవసరమైన మంచి వాతావరణం, పాఠశాల ప్రహరీ ఎలక్ట్రికల్, సోలార్ పరికరాలు, మరుగుదొడ్లు, నీటి సౌకర్యం, గ్రంథాలయం, ఆటస్థలం, ఆర్వో వాటర్‌ప్లాంట్, అన్ని తరగతి గదులకు ఫర్నీచర్, పూర్తిస్థాయి పరికరాలతో ల్యాబ్‌లు, హైస్పీడ్ ఇంటర్నెట్ సదుపాయం కలిగిన తరగతి గదులు, వినియోగంలో ఉన్న స్మార్ట్ టీవీ, వంట గదులు, కిచెన్ గార్డెన్ ఇతర అంశాలను పరిశీలించారు. వాటిలోని ఒక్కో అంశానికి 5చొప్పున గ్రేడింగ్ ఇచ్చారు. వాటిలో 90 శాతం గ్రేడింగ్ సాధించిన పాఠశాలలకు 5స్టార్లు కేటాయించారు. 30 కంటే తక్కువ ఉంటే ఒక స్టార్ ఇచ్చారు. కాకినాడ జిల్లాలో 200 పాఠశాలలు 4స్టార్లు, 674 పాఠశాలలు 3 స్టార్లు, 383 పాఠశాలలు 2స్టార్లు, 21 పాఠశాలలు ఒక స్టార్, 2 పాఠశాలలు సున్నా స్టార్ సాధించాయి.

స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివాస్ విజయవంతం చేయాలి

- కలెక్టర్ షాన్‌మోహన్



కలెక్టరేట్(కాకినాడ),ఫిబ్రవరి14(ఆంధ్రజ్యోతి: స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛదివాస్ కార్యక్రమాన్ని భారీ స్థాయిలో నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ షాన్‌మోహన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కాకినాడ కలెక్టర్ కార్యాలయంనుంచి జిల్లాస్థాయి, మండలస్థాయి అధికారులతో శుక్రవారం ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం తాగునీటి వనరులు శుభ్రపరచడం, చెత్త తొలగించడం, నీరు శుభ్రపరచడం, వాటర్ స్టోరేజ్, ట్యాంకర్ వద్ద ఉన్న గార్బేజిను క్లీన్ చేయడం, కెనాల్‌లోఉన్న చెత్తను తొలగించే కార్యక్రమం చేయాలన్నారు. దీని తోపాటు తడి, పొడి చెత్త విడివిడిగా సేకరణ చేసేలా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పర్యావరణ పరిరక్షణ అంశంలో ప్రజలు భాగస్వామ్యాన్ని ప్రోత్సహించడం, పరిశుభ్రమైన వాతావరణం ద్వారా ప్రజారోగ్య పరిరక్షణ, పర్యావరణంపై కాలుష్య ప్రభావాన్ని తగ్గించడం, ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించడం, పిల్లలు, భవిష్యత్ తరాల వారికి పర్యావరణ పరిశుభ్రతపై అవగాహన కల్పించడం అనే లక్ష్యాలతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం నిర్వహణలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ కీలకభూమిక పోషించాల్సి ఉందన్నారు. ఈ టెలీకాన్ఫరెన్స్‌లో జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి

- జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు



కలెక్టరేట్(కాకినాడ),ఫిబ్రవరి14(ఆంధ్రజ్యోతి: ఈనెల 27న జిల్లాలో జరిగే ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ పోలింగ్ ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో సమర్థవంతంగా నిర్వహించాలని తూర్పు-పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఏఆర్వో, కాకినాడ జిల్లా రెవెన్యూ అధికారి వెంకట్రావు అధికారులను ఆదేశించారు. ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి శుక్రవారం కాకినాడ కలెక్టరేట్‌లో పీవో, ఏపీవో, సెక్టార్ అధికారులకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలో 35మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారన్నారు. బ్యాలెట్ పత్రం, బ్యాలెట్ బాక్సుల విధానంలో పోలింగ్ జరుగుతుందన్నారు. ఈపోలింగ్ ప్రక్రియను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా పోలింగ్ సిబ్బంది కృషి చేయాలన్నారు. పోలింగ్ కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న ఇతర సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. కాకినాడ జిల్లాలో 70,540 మంది ఓటర్లకు 21 మండలాల్లో 98 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ ప్రక్రియ ఈనెల 27న గురువారం ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు జరుగుతుందన్నారు. పీవోలు 123మంది, ఏపీవోలు 123 మంది, 21 సెక్టార్ అధికారులను నియమించామన్నారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్స్‌లను కాకినాడ కలెక్టరేట్ వివేకానంద హాల్‌లో ఏర్పాటు చేసిన తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్‌కి సురక్షితంగా తరలించేవరకు అప్రమత్తతతో వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో మల్లిబాబు, కలెక్టరేట్ ఎన్నికల విభాగం ఉప తహసీల్దార్ జగన్నాథం పాల్గొన్నారు.

వీళ్లు మహాముదుర్లు!

- తుని మున్సిపాలిటీలో రూ.కోట్లలో బకాయిల వెనుక ముడుపుల కోణం
- అధికారుల చోద్యంతో కుంటుపడుతున్న పట్టణాభివృద్ధి
- మున్సిపల్ ఆర్డీ తనిఖీల్లో బయటపడిన లోపాలు
- గతనెలలో కమిషనర్‌తోపాటు మరో ముగ్గురికి షోకాజ్ నోటీసులు



తుని రూరల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మున్సిపాలిటీల్లో తుని మున్సిపాలిటీ ఒకటి. జిల్లాలో మరి ఏ మున్సిపాలిటీలో లేని ఆదాయ వనరులు ఇక్కడున్నాయి. వ్యాపార కేంద్రంగా ప్రసిద్ధి చెందిన తుని పట్టణంలో మున్సిపాలిటీకి సంబంధించి 615 షాపులు ఉన్నాయి. ఈ షాపుల అద్దెలు రూపాన ఏటా మున్సిపాలిటీకి కోట్లాది రూపాయల ఆదాయం వస్తోంది. ఈ ఆదాయంపై కొందరి అవినీతి అధికారులు కన్ను పడి అందినకాడికి దండుకుంటూ మున్సిపాలిటీ ఆదాయానికి గండి కొడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. తుని మున్సిపాలిటీ చరిత్రలోనే ఎన్నడూ లేనన్ని బకాయిలు పేరుకుపోవడం వెనక మున్సిపాలిటీలో కొందరు అవినీతి అధికారులు ప్రమేయం ఉందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఏళ్లతరబడి మున్సిపల్ షాపులకు అద్దెలు చెల్లించకపోవడంతో రూ.6కోట్లకు పైబడి బకాయిలు పేరుకుపోవడం విమర్శలకు తావిస్తోంది.

నిబంధనలు తుంగలో తొక్కి...

మున్సిపల్ నిబంధనల ప్రకారం మూడేళ్లకు ఒకసారి షాపులు రెన్యువల్ సమయంలో లీజు అగ్రిమెంట్లతోపాటు తగిన సాల్వెన్స్ స్వీకరించి వ్యాపార సముదాయాలను అప్పగించాల్సి ఉన్నా, మున్సిపాలిటీలో కొందరు అధికారులకు పాటదారులు చేతులు తడపడంతో నిబంధనలు తుంగలో తొక్కి, అద్దె వసూళ్లలో అలసత్వం వహించారన్న ఆరోపణలున్నాయి. వరసగా మూడునెలలు అద్దె చెల్లించకుంటే నోటీసులు జారీ చేసి రికవరీ చేయాలి. అప్పటికీ అద్దె జమ కాకుంటే విద్యుత్తు కనెక్షన్లు తొలగింపు ఆదేశాలిచ్చి షాపులు సీజ్ చేయాల్సి ఉంది. కానీ, ఏ చర్యలు చేపట్టలేదని తెలుస్తోంది. 100కుపైబడి షాపుల్లో పదిలక్షల పైబడి బకాయిలు ఉండడంపై మున్సిపల్‌శాఖ ఉన్నతాధికారులు దృష్టిసారించారు. ఇటీవల రీజనల్ డైరెక్టర్ బృందం తుని మున్సిపల్ కార్యాలయంలో తనిఖీలు చేపట్టి అధికారులు తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. తుని పట్టణంలో ఇటీవల కాలంలో మున్సిపల్ నిబంధనలు ఉల్లంఘించి అడ్డగోలుగా నిర్మాణాలు చేపట్టిన భవన యజమానులనుంచి పెద్దమొత్తంలో డబ్బులు చేతులు మారడంవల్ల అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరించారని తెలుస్తోంది. దీనివల్ల మున్సిపల్ ఖజానాకు గండిపడడంతో తుని ప్రజలనుంచి మునిసిపల్ ఉన్నతాధికారులకు వరుస ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో మున్సిపల్‌శాఖ ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి గతనెల మొదటి వారంలో తుని మున్సిపల్ కమిషనర్‌తోపాటు మరో ముగ్గురు అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలుస్తోంది.



పిఠాపురం బైపాస్‌లో దట్టంగా అలముకున్న పొగ మంచు (పైన)
పిఠాపురం-గొల్లప్రోలు మధ్య 216 జాతీయ రహదారిపై పొగ మంచు (కింద)



- ఉదయం 9 గంటల వరకు తగ్గని ప్రభావం
- సాయంత్రం 4 గంటల నుంచే మరలా మొదలు
- దట్టంగా అలముకుంటున్న పొగ మంచు
- పగటి పూట ఉష్ణోగ్రతలు పెరిగినా తగ్గని చలి తీవ్రత


ఎండ తీవ్రత గణనీయంగా పెరుగుతున్నా పొగ మంచు ప్రభావం తగ్గకపోగా రోజు రోజుకీ అధికమవుతోంది. రహదారులు, పొలాలపై మంచు దుప్పటి మాదిరిగా పరచుకోవడంతో పాటు తెల్లవారుజాము సమయాల్లో రోడ్లు కనిపించని పరిస్థితి నెలకొంది.

పొగ మంచు దుప్పటి

పిఠాపురం/గొల్లప్రోలు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో భిన్నమైన పరిస్థితులతో పొగ మంచు ప్రభావం ఎక్కువైంది. పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాలతో పాటు కాకినాడ జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో రాత్రి, పగటి వేళల్లో మంచు కురుస్తోంది. కొన్ని రోజులుగా ఉదయం 9 గంటలు దాటినా మంచు ప్రభావం తగ్గట్లేదు. సాయంత్రం నాలుగు గంటలకే మంచు కురవడం ప్రారంభమవుతోంది. బుధ, గురువారాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. అన్ని ప్రాంతాల్లోనూ రహదారులు, పంట పొలాలు, నివాస ప్రాంతాలను పొగ మంచు ఆవరించింది. గురువారం గరిష్ఠ ఉష్ణోగ్రత 35 డిగ్రీలుగా నమోదైంది. వేడి, ఉక్కపోతలతో ప్రజలు సతమతమవుతున్నారు. గత మూడు, నాలుగు రోజులుగా ఇదే స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నా చలి తీవ్రత మాత్రం తగ్గడం లేదు. తెల్లవారుజామున 3 గంటలకు కనిష్ఠ ఉష్ణోగ్రతలు 19-20 డిగ్రీల మధ్య నమోదవుతున్నాయి. అర్ధరాత్రి దాటాక పొగ మంచు ప్రభావంతో రహదారులు కనిపించట్లేదు. 16, 216 జాతీయ రహదారులు, ఇతర రాష్ట్ర రహదారులపై వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. పలుచోట్ల వాహనాలను రోడ్డుపక్కన నిలిపివేసి వెలుతురు వచ్చిన తర్వాత తిరిగి ప్రయాణాలు సాగిస్తున్నారు. భిన్నమైన వాతావరణంతో చిన్నారులు, పెద్దల్లో జ్వరాలు, రొంప, దగ్గు, గొంతునొప్పి, వంటి నొప్పులతో బాధపడుతూ ఆసుపత్రులకు వస్తున్న వారి సంఖ్య పెరుగుతోంది. వాతావరణ మార్పులే ఇందుకు కారణమని వైద్యులు చెప్తున్నారు.



గొల్లప్రోలు-పిఠాపురం మధ్య వరి పొలాలను ఆవరించిన పొగ మంచు



జీబీఎస్ అలెర్ట్

రోగ నిరోధక శక్తిని నశింపజేస్తున్న సిండ్రోమ్

కాకినాడ జీజీహెచ్‌లో నాలుగు కేసుల నమోదు



జీజీహెచ్ (కాకినాడ), జనవరి 14 (ఆంధ్రజ్యోతి): వైరస్ వల్ల వ్యాప్తి చెందే ఈ గులియన్ బర్రె సిండ్రోమ్ (జీబీఎస్)లో చాలా రకాలుంటాయి. ప్రథమంగా యాగ్జోనల్ వేరియంట్, డిమైనలేటింగ్ వేరియంట్ అనే రెండు రకాలుంటాయి. ఇవి వెన్నుపూస దగ్గర నుంచి కాళ్లు, చేతులు, మెడ, తలకు వెళ్లే నరాలకు వ్యాపిస్తాయి. ఇది వైరల్ జ్వరం ద్వారా వచ్చే దగ్గు, జలుబు లేదా తీవ్రమైన వాంతులు, విరోచనాలు తగ్గాక సంబంధిత వైరస్‌కు గానీ లేదా బ్యాక్టీరియాకు గానీ రక్షణ కోసం వచ్చిన కొన్ని యాంటీ బాడీస్ నరాలపై వాటి ప్రభావాన్ని చూపిస్తాయి. తద్వారా నరాలు చచ్చుబడిపోతాయి. సహజంగా వైరల్ ఫీవర్ వచ్చాక మైకో ప్లాస్మా న్యుమోనియా అనేది రావడం సహజం. అది తగ్గాక వారం, రెండు వారాల్లో నరాలు చచ్చుబడిపోవడానికి అవకాశాలు ఎక్కువ లేదంటే క్యాంపలో బ్యాక్టర్ బ్యాక్టీరియా అంటే తీవ్రమైన వాంతులు, విరోచనాలు అయ్యాక రెండు వారాలు గడిచాక జీబీ సిండ్రోమ్‌గా రూపాంతరం చెందుతుంది.

లక్షణాలు: మొదట కాళ్ల వద్ద తిమ్మిర్లు ప్రారంభమై అవి చేతులదాకా పాకి పట్టు తప్పుతాయి. వణుకు ఎక్కువై మల, మూత్రాలు మందమవుతాయి. అలసట ఎక్కువగా ఉంటుంది. రక్తపోటు, మధుమేహం, గుండె చప్పుడుల్లో అనేక మార్పులు చోటుచేసుకుంటాయి. వేసుకున్న చెప్పులు మనకు తెలియకుండానే జారిపోవడం, కింద కూర్చుని లేవలేకపోవడం. కొంతమంది మెడ నిలబెట్టలేకపోవడం, మింగలేకపోవడం, శ్వాస అందకపోవడం లాంటి లక్షణాలు కనిపిస్తాయి. శ్వాస కోసం పనిచేసే కండరాలు కూడా ప్రభావితమవుతాయి. ఈ వ్యాధి నాలుగు వారాలు వరకు పెరగవచ్చు లేదా ఐదు రోజుల్లోనే ఎక్కువ కావచ్చు. మరికొంతమందికి వారం, పది రోజుల వరకు పెరిగి ఆగిపోతుంది. కొంతమందికి కాళ్లు పట్టు మాత్రమే వదులుతాయి. మరి కొంతమందికి కాళ్లు, చేతులు కూడా వదులుతాయి. ఇంకొంతమందికి మెడ వాలిపోతుంది. తద్వారా ఆయాసం తీవ్రమై వెంటిలేటర్ పైకి వెళ్లే అవకాశముంది. ఈ వ్యాధి కేవలం నాలుగు వారాల వరకే పెరుగుతుంది. ఆఒక్కోసారి ప్రాణాపాయంలోకి వెళ్లకుండా చికిత్స లేకుండానే బాధితులు కోలుకుంటారు. అయితే కోలుకున్న అనంతరం ఏదో ఒక అవుకుతనంతో బాధపడతారు. వృద్ధులు, చిన్న పిల్లలపై ఈ వైరస్ ప్రభావం ఎక్కువగా ఉంటుంది. నడి వయస్కులపై ప్రభావం చూపదు.

అప్రమత్తంగా ఉంటూ లక్షణాలు కనిపించిన వెంటనే అర్హుడైన న్యూరో ఫిజీషియన్‌ను సంప్రదించి వైద్య చికిత్స పొందితే ఈ వ్యాధి నుంచి వెంటనే విముక్తి పొందుతారు. కాకినాడ జీజీహెచ్ న్యూరాలజీ విభాగంలో అన్ని వసతులతో కూడిన వైద్య చికిత్స అందుబాటులో ఉంది.

- ఏపీలో మొత్తం 17 కేసులు నమోదు కాగా కాకినాడ జీజీహెచ్‌లో నాలుగు వెలుగు చూశాయి.
- అతిగా ఇన్ఫెక్షన్లు, వ్యాక్సిన్లు, సర్జరీలు, ట్రామా, జన్యుపరంగానూ జీబీఎస్ వ్యాధి వచ్చే అవకాశముంది.
- ఇంట్రా వీనస్ ఇమ్యూనో గ్లోబిన్ ఇంజక్షన్ చేయించుకోవాలని వైద్య, ఆరోగ్య శాఖ సూచిస్తోంది.
- రాష్ట్రవ్యాప్తంగా 8వేల వ్యాక్సిన్లు అందుబాటులో ఉంచామని, ఎన్టీఆర్ వైద్య సేవ కింద ఉచిత చికిత్స అందిస్తామని రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది.

ప్రాణాంతకం కాదు



మన రోగ నిరోధక వ్యవస్థే మన నరాలు, కండరాలపై దాడి చేసి విచ్ఛిన్నం చేస్తుంది. జీబీఎస్ లక్ష మందిలో ఒకరికి మాత్రమే సోకే అత్యంత అరుదైన వ్యాధి. మనకు తెలియకుండానే మరణం అంచుల వరకు వెళ్లి వస్తాం. ప్రాణాంతకం కాదు.

డాక్టర్ ఎండీ షరీఫ్
న్యూరో మెడిసిన్ విభాగ ఇన్‌చార్జి, కాకినాడ జీజీహెచ్

క్రీడా సంబరానికి సర్వం సిద్ధం

- నేటి నుంచి కాకినాడ వేదికగా ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్
- 18 రాష్ట్రాల నుంచి పాల్గొంటున్న 43 జట్లు
- వెయ్యిమంది క్రీడాకారులు, వంద మంది కోచ్‌లు
- ఫ్లడ్‌లైట్ల వెలుతురులో మెరిసిపోతున్న ఆస్ట్రో టర్ఫ్ హాకీ ఫీల్డ్ కోర్టు
- క్రీడాకారులతో నిండిపోయిన కాకినాడలో హోటళ్లు
- నేటి నుంచి 28వ తేదీ వరకు క్రీడాపోటీలు
- అతిథులుగా వస్తున్న అర్జున, ఖేల్ రత్న అవార్డు గ్రహీతలు



కలెక్టరేట్(కాకినాడ), ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): 2024-25 ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ పురుషులు, మహిళల టోర్నమెంట్‌ను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు కాకినాడలోని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ మైదానం అన్ని హంగులతో సర్వాంగ సుందరంగా సిద్ధమైంది. సెంట్రల్ సివిల్ సర్వీసెస్ కల్చరల్ అండ్ స్పోర్ట్స్ బోర్డ్ ఆధ్వర్యంలో శనివారం నుంచి 28వ తేదీ వరకు నిర్వహిస్తున్న జాతీయస్థాయి క్రీడాపోటీలను రాష్ట్ర, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థలు ఆతిథ్యం ఇస్తుండగా, కాకినాడజిల్లా యంత్రాంగం సహాయ సహకారాలను అందిస్తోంది. ఇందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ఇప్పటికే పూర్తిచేశారు. ఈటోర్నమెంట్ ప్రారంభ వేడుకలు శనివారం సాయంత్రం 4గంటకు డీఎస్‌ఏ మైదానంలో జరుగుతాయి. ఈవేడుకలకు రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు, అర్జున, ఖేల్‌రత్న అవార్డు గ్రహీతలు అతిథులుగా హాజరుకానున్నారు. వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు, రీజనల్ స్పోర్ట్స్ బోర్డులు నుంచి పురుష, మహిళల టీమ్‌లు ఈ పోటీలలో పాల్గొంటున్నాయి. సుమారు 1000 మంది క్రీడాకారులు, 100మంది కోచ్‌లు, మేనేజర్లు ఈ పోటీలలో పాల్గొననుండగా, శుక్రవారం సాయంత్రా నికి దాదాపు 650 మంది కాకినాడ చేరుకున్నారు. ఆతిథ్యం ఇస్తున్న మనరాష్ట్రం నుంచి పురుషులు, మహిళల జట్లు ఈపోటీలో పాల్గొంటున్నాయి. వీరందరికీ టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కమిటీలు రైలు, బస్‌స్టేషన్లు, విమానాశ్రయాలు వద్దే స్వాగతం పలికి ప్రత్యేక బస్సులలో వారికి కాకినాడ నగరంలోని వివిధ హోటళ్లు, అతిథి గృహాల్లో బస ఏర్పాటు చేశారు. కాకినాడ నగరంలోని అన్ని ప్రధాన కూడళ్లలో ఫ్లెక్సీలు పోస్టర్లు ఏర్పాటు చేయడంతో పాటు ప్రసార మాధ్యమాల ద్వారా ప్రజలలో విస్తృత ప్రచారం కల్పించారు. ఈ టోర్నమెంట్‌ను అపూర్వరీతిలో నిర్వహించేందుకు జిల్లాకలెక్టర్ షాన్‌మోహన్, జిల్లా జేసీ రాహుల్‌మీనాలు గడి చిన వారంరోజులుగా ఏర్పాట్లను నిత్యం స్వయం గా పర్యవేక్షిస్తూ, అధికారులకు సూచనలు, ఆదేశాలు జారీ చేస్తున్నారు. వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన జిల్లా అధికారులతో 14 అం శాల వారీ ఏర్పాటుచేసిన కమిటీలు యుద్ధప్రా తిపదికన పనులు పూర్తి చేశాయి.

పోటీలో 43 జట్లు

దేశంలో ఉన్న 18రాష్ట్రాలు, రెండు కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి 43జట్లు పాల్గొంటు న్నాయి. ప్రధానంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, హర్యానా, చత్తీస్‌ఘడ్, న్యూఢిల్లీ, మధ్యప్రదేశ్, కేరళ వంటి రాష్ట్రాల నుంచి ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ ఉద్యోగులు పాల్గొంటున్నారు. కాకినాడజిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ అధ్యక్షతన ఆర్గనైజింగ్ కమిటీ ఏర్పాటుచేశారు. జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా కన్వీనర్‌గా, డీఆర్వో వెంకట్రావు, సీపీవో త్రినాథ్ సభ్యులుగా ఉన్నారు. టోర్నమెంట్ చీఫ్ కోఆర్డినేటర్‌గా డీఎస్‌డీవో శ్రీనివాసరావు వ్యవ రిస్తున్నారు. మ్యాచ్‌లు వీక్షించే ప్రేక్షకులకు గ్యాలరీలు ఏర్పాటు చేశారు.



ప్రత్యేక అలంకరణలో మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి

వైభవంగా భీమేశ్వరుడి పుష్పోత్సవం

ద్రాక్షారామ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ శ్రీ మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామివార్ల కల్యాణోత్సవంలో ఆఖరి అంకమైన శ్రీపుష్పోత్సవం శుక్రవారంరాత్రి వైభవంగా జరిగింది. వేదపండితులు, అర్చకులు వేద మంత్రోచ్ఛరణలతో శాస్త్రోక్తంగా శ్రీపుష్పోత్సవా న్ని ఘనంగా నిర్వహించారు. స్వామి,అమ్మవార్లను అందంగా ముస్తాబు చేసి ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన వేదికపై ఉన్న పీఠంపై ఉంచి పుష్పాలతో అలంకరించారు. ఈకార్యక్రమం కోసం మాణిక్యాంబ అమ్మవారిని రకరకాల పూలు, పండ్లతో అలంకరించారు. భక్తులు తెచ్చిన స్వీట్లను పూజా మందిరంలో ఉంచారు. పూజా కార్యక్ర మం అనంతరం తొలి దంపత తాంబూలాన్ని దేవస్థానం బ్రహ్మ బ్రహ్మశ్రీ దేవులపల్లి ఫణిరామకృష్ణ దంపతులకు అంద జేశారు. ఈ పుష్పోత్సవం తిలకించడానికి భక్తులు తరలివచ్చారు. హాజరైన భక్తులకు కొబ్బరి బొండాం, జాకెట్ ముక్క, దంపత తాంబూ లంగా అర్చకస్వాములు అందజేశారు. అనంతరం స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించిన ఊయలలో శయనింపచేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి దుర్గాభవాని పర్యవే క్షించారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

అన్నవరం దేవస్థానం రత్న, సత్యగిరి చుట్టూ

భూ సర్వే ప్రక్రియ ప్రారంభం

- వారంరోజులపాటు కొనసాగనున్న సర్వే

అన్నవరం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానంకు సంబంధించి రత్న, సత్యగిరిల చుట్టూ ఉన్న స్థలాలు, భూములపై శుక్రవారం నుంచి సర్వే ప్రక్రియ ప్రారంభించారు. రావోర్ సర్వే ద్వారా త్వరితగతిన పని పూర్తవుతుందని భావించి ఈ విధానాన్ని ప్రారంభించారు. తొలిరోజు దేవస్థానం కళాశాల వెనుకభాగంలో చేపట్టగా అక్కడక్కడా ఆక్రమణలు ఉన్నట్లు గుర్తించి మార్కింగ్ వేశారు. దేవస్థానం సత్యరత్నగిరిల చుట్టూ ఆక్రమణలపై ఇప్పటికే చాలాసార్లు సర్వే చేపట్టి పూర్తికాకుండా మధ్యలో వదిలేసిన సంఘటనలు చాలా ఉన్నాయి. ఈ సర్వే అయినా పూర్తిగా చేపడతారా రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి మధ్యలోనే నిలుపుదల చేస్తారా అనేది వేచిచూడాలి. ప్రస్తుతం అన్నవరం దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు రెవెన్యూ నుంచి రావడంతో వీటిపై పూర్తి అవగాహన ఉండడంతో సర్వే అంతా పూర్తిచేయాలని ఆశించాలి. వారంరోజులపాటు సర్వే ఉంటుందని దేవస్థానం లీజుల విభాగ అధికారులు తెలిపారు. ఈ సర్వేలో లీజుల విభాగ ఏఈవో బీఎన్ రెడ్డి, సూపరింటెండెంట్ పి.వి.రమణ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ భాస్కరప్రసాద్, మండల సర్వేయర్ రాజు తదితరులు ఉన్నారు.



దేవస్థానం భూముల్లో సర్వే చేస్తున్న అధికారులు, దేవస్థానం సిబ్బంది

'రూసా' పరిశోధనా ప్రాజెక్టులపై వీసీ సమీక్ష



వర్శిటీ అధికారులతో సమీక్షిస్తున్న వీసీ మురళీకృష్ణ

జేఎన్టీయూకే, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ ఉచ్చతర్ శిక్షా అభియాన్ (రూసా) కింద వర్శిటీలో చేపడుతున్న పరిశోధనా ప్రాజెక్టులపై జేఎన్టీయూకే ఇన్‌చార్జి ఉపకులపతి కేవీఎస్‌జీ మురళీకృష్ణ శుక్రవారం ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్లతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా రూసా పరిశోధనా ప్రాజెక్టుల వివరాలను అధికారులను అడిగి వీసీ తెలుసుకున్నారు. విశ్వవిద్యాలయంలో పరిశోధనలపై దృష్టి కేంద్రీకరించడం ద్వారా 9 పరిశోధనా ప్రాజెక్టులకు రూ.93లక్షలు రూసా నిధులు మంజూరయ్యాయని తెలిపారు. రెండేళ్ల పాటూ చేపట్టనున్న ఈ పరిశోధనా ప్రాజెక్టులకు ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్లు ప్రాజెక్టు ఫెలోను త్వరితగతిన నియమించుకోవడంతో పాటూ పరిశోధనలకు అవసరమైన పరికరాలను సమకూర్చుకోవాలన్నారు. 9 పరిశోధనా ప్రాజెక్టులకు సంబంధించినజర్నల్స్‌ను ప్రచురితమయ్యేలా తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. ఈసమీక్షకు రూసా సమన్వయకర్త, వైస్ ప్రిన్సిపాల్ ఎం. స్వరూపారాణి అధ్యక్షత వహించగా, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రవీంద్రనాథ్, మాజీ ఉపకులపతి జీవీఆర్ ప్రసాదరాజు, వి.శ్రీనివాసులు, బీటీ కృష్ణ, ప్రిన్సిపాల్ మోహన్‌రావు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు

తమిళనాడు యువకుడి సైకిల్ యాత్ర

ఆత్రేయపురం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): దేశ విదేశాలలో మొక్కలు నాటుతూ ఆక్సిజన్ శాతాన్ని వాతావరణంలో పెంపొందించేందుకు తమిళనాడుకు చెందిన యువకుడు ముత్తు సెల్వాన్ పర్యావరణ పరిరక్షణ కోసం సైకిల్‌పై యాత్ర చేపట్టాడు. 32,200 కిలోమీటర్ల దూరాన్ని 1111 రోజుల్లో ప్రయాణించి పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా మొక్కలు నాటి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు కోసం సైకిల్‌పై సాహసయాత్ర చేపట్టాడు. 2021 డిసెంబరు 28న సైకిల్‌యాత్రను ప్రారంభించిన సెల్వాన్ శుక్రవారం జిల్లాలోని ఆత్రేయపురం చేరుకున్నాడు. తమిళనాడు రాష్ట్రం కొయంబత్తూరుకు చెందిన సెల్వాన్ ఈ సాహసయాత్ర చేపట్టాడు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో ఉన్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావును సెల్వాన్ కలిసి తన సైకిల్‌యాత్ర కోసం వివరించాడు. భారత దేశంలోని అన్ని రాష్ట్రాలతోపాటు నేపాల్, భూటాన్, బంగ్లాదేశ్ తదితర దేశాలలో సైకిల్ యాత్ర ద్వారా మొక్కలు నాటుతూ పర్యావరణ పరిరక్షణ కోసం పాటుపడుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సెల్వాన్‌ను ఎమ్మెల్యే సత్యానందరావు, ఆయన తనయుడు సంజీవ్ దుశ్శాలువాతో సత్కరించి ఆర్థిక సాయం అందజేశారు.



సైకిల్ యాత్ర చేస్తున్న సెల్వాన్‌ను సత్కరిస్తున్న కొత్తపేట ఎమ్మెల్యే సత్యానందరావు

విద్యార్థిపై కోడికత్తితో దాడి

- కరప మండలం యండమూరులో ఘటన
- తారాజువ్వల కాల్చివేత విషయంలో గొడవ...
- పోలీస్ పికెట్ ఏర్పాటు


దాడిలో తీవ్రంగా గాయపడిన ఈశ్వరరావు

కరప, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరప మండలం యండమూరులో గురువారం రాత్రి ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. తారాజువ్వల విషయంలో తలెత్తిన వివాదం చినిచినికి గాలివానలా మారింది. ఒక విద్యార్థిపై కొంతమంది యువకులు కోడి కత్తితో దాడిచేసి తీవ్ర సంచలనం సృష్టించారు. కరప పోలీసులు, బాధితుల వివరాల ప్రకారం. యండమూరుకి చెందిన కురుపూడి ఈశ్వరప్రసాద్ కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈనెల 8వ తేదీన స్థానిక మీసాల వెంకన్నకల్యాణ ఉత్సవాల్లో భాగంగా జరిగిన రథం ఊరేగింపులో ఈశ్వరప్రసాద్, అతని స్నేహితులు తారాజువ్వలు వేయగా, అదే గ్రామానికి చెందిన మారెళ్ల అజయ్, గుబ్బల కాలేబు, జిజేల్ అనే యువకులు వారి వద్దకు వెళ్లి కావాలనే తమపై తారాజువ్వలు వదిలినట్టు ఆరోపిస్తూ వాగ్వాదానికి దిగి, మీ అంతు చూస్తామంటూ అక్కడ నుంచి వెళ్లిపోయారు. తిరిగి మళ్లీ 13వ తేదీన కాలేజీలో ఉన్న ఈశ్వరప్రసాద్‌కు మారెళ్ల అజయ్ ఫోన్ చేసి సాయంత్రం ఇంటికి రాగానే వెంకన్నబాబు గుడి వద్దకు చేరుకోవాలని చెప్పాడు. దీంతో భయపడిన ఈశ్వరప్రసాద్ గ్రామానికి చెందిన గుబ్బల సాయి, పితాని శేఖర్‌ను వెంటబెట్టుకుని మోటార్‌సైకిల్‌పై వెళ్లాడు. అజయ్ వద్దకు ఈశ్వరప్రసాద్ వెళ్లి మాట్లాడుతుండగా కాలర్ పట్టుకుని కిందకు తోసేశాడు. అక్కడే ఉన్న అజయ్ స్నేహితులు కాలేబు, విజయ్, వినోద్, అనిల్, మనోహర్, లచ్చన్న కిందపడ్డ ఈశ్వరప్రసాద్‌ను కదలకుండా గట్టిగా పట్టుకోవడంతో అజయ్ చంపాలన్న ఉద్దేశంతో కోడికత్తితో విచక్షణారహితంగా దాడిచేశాడు. ఈ దాడిలో ఈశ్వరప్రసాద్ తల, ఎడమ, కుడి పక్కన నుదిటిమీద, ఎడమ భుజం, కుడి చాతిపైన తీవ్ర గాయాలయ్యాయి. దీంతో షాక్‌కు గురైన ఈశ్వరప్రసాద్ స్నేహితులు సాయి, శేఖర్, అదే సమయంలో అటుగా వెళ్తున్న వెంకటేష్, దుర్గాప్రసాద్, సాయికృష్ణ అజయ్ మిత్రబృందం నుంచి కాపాడి రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో గ్రామంలోని రెండువర్గాల మధ్య తీవ్ర దుమారం రేగింది. విషయం తెలుసుకున్న పోలీస్ ఉన్నతాధికారులు కాకినాడ రూరల్ సీఐ చైతన్యకృష్ణ ఆధ్వర్యంలో కరప, పెదపూడి, గొల్లపాలెం, కోరంగి, తిమ్మాపురం, ఇంద్రపాలెం ఎస్ఐలు తోట సునీత, రామారావు, సత్యనారాయణరెడ్డి, మోహన్‌కుమార్, వీరబాబు, రవీంద్ర, సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని విచారణ చేపట్టారు. దాడిలో ఉపయోగించిన కోడికత్తి, ఇతర ఆధారాలను సేకరించారు. గ్రామంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా పోలీస్ పికెట్ ఏర్పాటుచేశారు. తీవ్రంగా గాయపడిన బాధితుడు, అతని మిత్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు కరప ఎస్ఐ సునీత తెలిపారు.


ఘటనాస్థలంలో ఆధారాలు సేకరిస్తున్న ఎస్ఐ సునీత, పోలీస్ సిబ్బంది

45 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

- వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు


రమణక్కపేట ఉన్నత పాఠశాల సమీపంలో బియ్యం లోడుతో ఉన్న వ్యాన్

కొత్తపల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న 45 టన్నుల రేషన్ బియ్యాన్ని కాకినాడ జిల్లా కొత్తపల్లి ఎస్ఐ జి. వెంకటేష్ పట్టుకొన్నారు. శుక్రవారం తన సిబ్బందితో రమణక్కపేటకు వెళుతుండగా, ఊరుచివర ఉన్న జడ్పీ హైస్కూల్ వద్ద ఓ వ్యాన్‌ను గుర్తించారు. అను మానం వచ్చి దాన్ని పరిశీలించగా రేషన్‌బియ్యం ఉన్నాయి. దీన్ని గుర్తించి తహసీల్దార్ జి. చిన్నారావుకు సమాచారమిచ్చారు. దీంతో సామర్లకోట సివిల్‌సప్లయిస్ డిప్యూటీ తహసీల్దార్ కమల వెళ్లి స్వాధీనపర్చుకున్నారు. గొల్లప్రోలుకు చెందిన వీ. లక్ష్మణ్ అక్రమంగా రవాణా చేస్తున్నట్టు గుర్తించారు. బియ్యాన్ని పిఠాపురం సివిల్ సప్లయిస్ పాయింట్‌కు తరలించారు. లక్ష్మణ్‌పై 6ఏ కేసుతో పాటు కొత్తపల్లి పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేసినట్టు సీఎస్‌డీటీ కమల చెప్పారు.

పొలంలో ఎరువు వేస్తూ ...

అస్వస్థతకు గురై యువ రైతు మృతి


మోర్త నాని (ఫైల్)

కె.గంగవరం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): వరి పొలంలో ఎరువులు, గుళికలు వేస్తూ అస్వస్థతకు గురై ఓ యువరైతు మృతిచెందాడు. కోనసీమ జిల్లా పామర్రులో శుక్రవారం ఈ ఘటన చోటుచేసుఉంది. ఎస్ఐ ఎస్‌కే జానీ బాషా తెలిపిన వివరాలివి. పానింగపల్లికి చెందిన మోర్త నాని (28) అనే యువ రైతు తను చేస్తున్న కౌలు పొలంలో ఎరువులు వేస్తుండగా అస్వస్థతకు గురయ్యాడు. అయితే ఉదయం వెళ్లిన నాని ఎంతకూ రాకపోవడంతో తండ్రి ఆనందరావు పొలం దగ్గరకు వెళ్లి చూసేసరికి అప్పటికే అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. తొలుత అతన్ని పామర్రు ఆసుపత్రిలో చేర్పించగా, మెరుగైన వైద్యం కోసం రామచంద్రపురం తరలించారు. ఈలోగా ఆసుపత్రికి చేరే సరికే మృతిచెందాడు. నాని తండ్రి ఆనందరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

వైసీపీ కౌన్సిలర్లు, నాయకులపై కేసు

పెద్దాపురం (సామర్లకోట), ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి):తహశీల్దార్ సంతకాలను ఫోర్జరీ చేసి, తప్పుడు పట్టాలను టాంపరింగ్‌కు పాల్పడిన వైసీపీ కౌన్సిలర్లు, నాయకులపై పెద్దాపురం పోలీస్‌స్టేషన్లో కేసులు నమోదు చేసినట్టు శుక్రవారం పెద్దాపురం పోలీసులు వెల్లడించారు. వివరాల్లోకి వెళితే గత ఏడాదిలో జరిగిన ఈ అక్రమ ఫోర్జరీ, ట్యాంపరింగ్ వ్యవహారంపై పెద్దాపురం కౌన్సిల్‌లో పెద్ద ఎత్తున దుమారం చెలరేగిన విషయం పాఠకులకు విదితమే. ప్రభుత్వ పోరంబోకు పుంతభూమికి ఫోర్జరీ పట్టాలు రూపొందించి ఎస్టీలకు అక్రమంగా రూ. 1.30 లక్షలకు విక్రయించిన సంఘటనపై అప్పట్లో తెలుగుదేశం పార్టీ నాయకులు పెద్దాపురం ఆర్డీవో జేఎస్ రామారావుకు ఫిర్యాదు చేయగా, తహశీల్దార్ వెంకటలక్ష్మిని విచారణ అధికారిగా నియమించారు. ఈ క్రమంలో విచారణ జరిపిన అనంతరం పట్టాలు ఫోర్జరీ చేసినట్టుగా తహశీల్దార్ గుర్తించారు. దీంతో తదుపరి చర్యల నిమిత్తం ఆర్డీవోకు నివేదికలు సమర్పించారు.

ఈ మేరకు రెవెన్యూ అధికారుల ఆదేశాలతో పెద్దాపురం ఎస్ఐ మౌనిక ఫోర్జరీ, ట్యాంపరింగ్, అక్రమ విక్రయాలు, చీటింగ్ నేరాలకు సంబంధించి ఇద్దరు వైసీపీ కౌన్సిలర్లు, ఇద్దరు వైసీపీ కార్యకర్తలపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

రైలు ఢీకొని.. గుర్తు తెలియని వ్యక్తి మృతి


పోలీసులు గుర్తించిన మృతదేహం

తుని రూరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొనడంతో ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన తుని రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. డీమార్ట్ వెనుక మూసివేసి ఉన్న గేటు వద్ద సుమారు 40 నుంచి 45 సంవత్సరాల మధ్య వయసు గల వ్యక్తి మృతి చెందినట్టు రైల్వే పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. అయితే మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు లభించకపోవడంతో రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈయనకి సంబంధించినవారు ఎవరైనా ఉంటే రైల్వే పోలీసుల నెంబర్ 9490619020కు కాల్ చేయాలన్నారు.

లక్ష్మీదేవిపేటలో 48 ఇళ్లు కూల్చివేత

- పట్టాభూమిలో నిర్మించడంతో కలెక్టర్ ఆదేశాలతో చర్యలు


జేసీబీతో తొలగిస్తున్న దృశ్యం

ఎటపాక, ఫిబ్రవరి14 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా ఎటపాక మండలం లక్ష్మీదేవిపేట రెవెన్యూ గ్రామ పరిధి పట్టాభూమిలో నిర్మించుకున్న 48 ఇళ్లను శుక్రవారం తెల్లవారు జామున రెవెన్యూ, పోలీసుల ఆధ్వర్యంలో కూల్చివేశారు. జిల్లా కలెక్టర్, చింతూరు ఐటీడీఏ పీవో ఆదేశాలతో కూల్చివేతకు అధికారులు చర్యలు తీసుకున్నారు. ఆపరేషన్‌లో భాగంగా తెల్లవారు జామున ఎటపాక తహశీల్దార్ కారం సుబ్బారావు, రెవెన్యూ సిబ్బంది, విలీన మండలాల్లోని పోలీసు అధికారులు బలగాలతో లక్ష్మీదేవిపేటలోని ఇళ్ల వద్దకు జేసీబీతో చేరుకున్నారు. ఇళ్లల్లోని సామగ్రిని బయటకు తీసి, పోలీసు బలగాల నడుమ జేసీబీలతో ఇళ్లన్నీ కూల్చివేశారు. తాటాకు ఇళ్లతో పాటు రేకులతో నిర్మించిన మెత్తం 48 ఇళ్లను నేలమట్టం చేశారు. అయితే రాష్ట్ర సరిహద్దులో ఉన్న 2 ఎకరాల 25 సెంట్ల భూమిలో నాలుగైదు ఏళ్ల క్రితం అల్లూరి జిల్లాలోని కూనవరం, వరరామచంద్రపురం, చింతూరుతోపాటు తెలంగాణలోని భద్రాద్రి జిల్లా చర్ల, వెంకటాపురం, వాజేడు మండలాలకు చెందిన గిరిజనులు ఇక్కడ ఇళ్లను నిర్మించుకుని జీవిస్తున్నారు. ఇటీవల ఈ భూమి గల యజమాని జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్‌కు తన పట్టా భూమిని ఆక్రమించి, ఇళ్లు నిర్మించుకున్నారని ఫిర్యాదుచేశాడు. దాంతో కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు కూల్చివేశారు. తమకు ఎటువంటి నోటీసులు ఇవ్వలేదని, ఉన్నపళంగా కూల్చితే ఎక్కడకి వెళ్లాలంటూ బాధితులు వాపోయారు. కూల్చివేతల అనంతరం కొందరు బాధితులతో జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఫోన్‌లో మాట్లాడారు. ఎటపాకలో ప్రభుత్వ స్థలాన్ని సర్వేచేసి మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ క్రమంలో తహశీల్దార్ సుబ్బారావుకు ప్రభుత్వ స్థలాల సర్వే నిర్వహించి, నివేదిక పంపాలని కలెక్టర్ ఆదేశించారు. కాగా భూ పట్టా కలిగిన యజమాని 2023 సంవత్సరంలో రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానమైన హైకోర్టును ఆశ్రయించి, తనకు అనుకూల తీర్పును పొందారని తహశీల్దార్ వెల్లడించారు. కాగా ఈ ఇళ్ల కూల్చివేత ఆపరేషన్‌లో సుమారు 150 పోలీసు బలగాలు పాల్గొన్నాయి.

పెనుగుదురులో చోరీ

బంగారం, వెండి ఆభరణాల అపహరణ

కరప, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): కరపమండలం పెనుగుదురులోని ఓ ఇంట్లోకి దొంగలు చొరబడి రూ.60 వేలు విలువచేసే బంగారం, వెండి ఆభరణాలు అపహరించుకుపోయారు. ఎస్ఐ తోట సునీత తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెనుగుదురు గ్రామానికి చెందిన పబ్బినీడి అప్పారావు ఎల్ఐసీ ఏజెంట్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈనెల 10వ తేదీ మధ్యాహ్నం ఇంటికి తాళం వేసి పాయకరావుపేట మండలం సచ్చివరం గ్రామంలోని బంధువుల ఇంటికి భార్యతో కలిసి వెళ్లారు. తిరిగి 12న ఇంటికి రాగా ఇంటి తాళాలు బద్దలుకొట్టి ఉండడాన్ని గమనించారు. లోపలికి వెళ్లి చూడగా 8గ్రాములు ఉండే రెండు జతల బంగారు చెవిదిద్దులు, 550గ్రాముల అష్టలక్ష్మి వెండిచెంబు, 300గ్రాములున్న రెండు వెండిగిన్నెలు, 200గ్రాములున్న రెండు వెండి దీపం కుందెలు వెరసి మొత్తం రూ.60వేలు విలువచేసే ఆభరణాలు చోరీకి గురైనట్టు గుర్తించారు. దీనిపై కరప పోలీసులకు ఫిర్యాదుచేయగా కాకినాడ నుంచి క్లూస్‌టీం వచ్చి ఆధారాలు సేకరించింది. దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నట్టు ఎస్ఐ సునీత తెలిపారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

సీతానగరం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): భర్త కనిపించడం లేదని భార్య జరీన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ డి.రామ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలంల వెలమపేట గ్రామానికి చెందిన షేక్ సర్కార్(40) గ్రామాల్లో తిరుగుతూ పాత ఇనుప సామాన్లు కొనుగోలు చేస్తుంటాడు. గత ఏడాది మార్చిలో జరీనా మస్కట్ వెళ్లింది. ఆమె వెళ్లిన పది రోజులకు సర్కార్ వ్యాపారం నిమిత్తం వెళ్లి తిరిగి రాలేదు. ఇటీవల మస్కట్ నుంచి తిరిగి వచ్చి జరీనకు భర్త కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు

నరసన్న ఆదాయం రూ.47,89,784

కల్యాణోత్సవాల్లో భాగంగా 17 రోజుల హుండీలు లెక్కించిన అధికారులు


హుండీలో వచ్చిన కానుకలను లెక్కిస్తున్న అధికారులు, సిబ్బంది

అంతర్వేది, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం దేవస్థానంలో హుండీలను లెక్కించారు. ప్రధాన ఆలయ హుండీ ద్వారా రూ.46,76,268, గుర్రాలక్కమ్మ హుండీ ఆదాయం రూ.82,241, అన్నదాన హుండీ ఆదాయం రూ. 27,275 వెరసిరూ.47,89,784 ఆదాయం వచ్చిందని ఆలయ సహాయ కమిషనర్ వి. సత్యనారాయణ తెలిపారు. కల్యాణోత్సవాల్లో భాగంగా 17 రోజులకుగాను స్వామివారి హుండీ ఆదాయాన్ని లెక్కించగా 8.500 మి.గ్రా. బంగారం, 104.370 మి.గ్రా. వెండి, విదేశీ కరెన్సీ నోట్లు వచ్చాయన్నారు. స్వామివారి అనుబంధ ఆలయమైన నీలకంఠేశ్వరస్వామి హుండీ ద్వారా రూ.47, 587 ఆదాయం వచ్చిందని ఏసీ తెలిపారు. కార్యక్రమంలో డీసీ డీఎల్వీ రమేష్‌బాబు, చైర్మన్ ఫ్యామిలీమెంబర్ రాజాకలిదిండి కుమారరామ గోపాల రాజాబహుదూర్, ఉత్సవ సేవాకమిటీ చైర్మన్ దిరిశాల బాలాజీ, ఎంపీటీసీ బైరా నాగరాజు, తనిఖీ అధికారి జె. రామలింగేశ్వరరావు, విశ్రాంత ఈవో బి.వెంకటేశ్వరరావు, ముప్పర్తి నాని, గుబ్బల ఫణికుమార్ పాల్గొన్నారు.

'పేరాబత్తుల'పై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు

ఎమ్మెల్సీ స్వతంత్ర అభ్యర్థి సుందర్

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఉభయ ఉమ్మడి గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లఘించారని, అతడిపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసినట్టు స్వతంత్ర అభ్యర్థి జీవీ సుందర్ అన్నారు. శుక్రవారం రాజమహేంద్రవరం రాజీవ్‌గాంధీ విద్యాసంస్థలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తూ దూరప్రాంతాల్లో ఉన్నవారికి బస్సు, రైలు టిక్కెట్లు బుక్ చేసేందుకు ఒక వాట్సాప్ నెంబరును రాజశేఖర్ వినియోగిస్తున్నారని, దానికి మెసేజ్ పెడితే స్పందించి ఓటరా కాదా అని నిర్ధారించుకున్నాక ట్రావెల్స్ సమాచారం అడిగి, టిక్కెట్ బుక్ చేసినట్టు మెసేజ్ పెడుతున్నారని పేర్కొన్నారు. దీనిపై ఎన్నికల కమిషన్‌కు మెయిల్‌లో ఫిర్యాదు చేశానని, కాని స్పందన లేదన్నారు. ఎన్నికల సంఘం స్పందించి రాజశేఖరంను అనర్హుడిగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

20 నుంచి జాతీయస్థాయి యువజనోత్సవాలు

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఈనెల 20, 21, 22 తేదీల్లో ఉద్భవ్ - 2025 పేరుతో జాతీయస్థాయి యువజన దినోత్సవం నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. యువజనోత్సవాల్లో భాగంగా విద్యార్థుల్లోని వ్యాపార నైపుణ్యాలను పెంపొందించే ఉద్దేశ్యంతో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ కార్యకలాపాలను కూడా భాగం చేశామని, విద్యార్థులతో వ్యాపార స్టాల్స్‌ను ఏర్పాటు చేసి నిర్వహించనున్నామని తెలిపారు. అలాగే ఆహారం, ఆటలు, ఫ్యాషన్ తదితర స్టాల్స్‌ను కూడా ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు.

మార్చి 14న రాజమహేంద్రవరంలో

ప్రభుత్వ ఉద్యోగుల నగర మహాసభ

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో భాగంగా మార్చి 14న రాజమహేంద్రవరం నగర మహాసభ నిర్వహిస్తున్నామని, ఈ సభలో అధిక సంఖ్యలో ఉద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీజీఈఏ) జిల్లా అధ్యక్షుడు పి.గిరి ప్రసాద్‌వర్మ కోరారు. శుక్రవారం సాయంత్రం రాజమహేంద్రవరంలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ ఆవరణలో సంఘం నగర కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో గిరిప్రసాద్ వర్మ మాట్లాడుతూ ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయం వద్దనున్న చందాసత్రంలో రాజమహేంద్రవరం నగర మహాసభ జరుగుతుందని అన్నారు. కొత్త ప్రభుత్వం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకునేలా సంఘం కృషి చేస్తోందని, ఇందులో భాగంగా అన్ని జిల్లాల్లోనూ ఉద్యోగుల సభలను జరుపుతున్నామని పేర్కొన్నారు. సభ విజయవంతానికి నగర, జిల్లా కమిటీలు సంయుక్తంగా పనిచేయాలని ప్రసాద్ వర్మ కోరారు. నగర అధ్యక్షుడు జీబీ విజయ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి సీహెచ్ఎస్ విల్సన్‌పాల్, నగర కార్యదర్శి బి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


నాగేశ్వరరావు (ఫైల్)

అంతర్వేది, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం కేశవదాసుపాలెం గ్రామంలో శుక్రవారం విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామంలో ఉండపల్లి నాగేశ్వరరావు(49) రొయ్యల చెరువు సాగుచేస్తున్నాడు. శుక్రవారం ఉదయం చెరువు వద్దకు వెళ్లి మేత వేస్తుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. దీంతో అతడిని రాజోలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మేరకు భార్య వరలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. మృతదేహానికి పంచనామా నిర్వహించి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. కాగా నాగేశ్వరరావుకు భార్య, కుమార్తె ఉన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి

- అవగాహన సదస్సులో డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మి



సదస్సులో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మి

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రహదారిపై వాహనాలు నడిపేవారంతా తప్పనిసరిగా రోడ్డు నిబంధనలు పాటించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) కార్యదర్శి ఎన్.శ్రీలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం రాజమహేంద్రవరంలోని ఏకేసీ కళాశాల రోటరీహాలులో బీమా క్లెయిమ్స్ పట్ల వాహనచోదకులకు అవగాహన సదస్సు నిర్వహించారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు - 2025లో భాగంగా జిల్లా రవాణా అధికారి ఆర్.సురేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో శ్రీలక్ష్మి మాట్లాడుతూ వాహనాలు నడిపే సమయంలో నిబంధనలు పాటించడం ఎంత ముఖ్యమో బీమా చేయించుకోవడం అంతే ముఖ్యమని స్పష్టం చేశారు. సుప్రీం కోర్టు ఉత్తర్వులమేరకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈశ్రమ్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్లు చేసుకోవడం వల్ల అసంఘటితరంగ కార్మికులకు సామాజిక, ఆర్థిక భద్రత ఏర్పడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంవీఐలు సీహెచ్ సంపత్‌కుమార్, ఎం.రవికుమార్, జి.రాంనారాయన్, కె.చైతన్య సుమ, జి.రాధికా దేవి, పీవీవీ సాయికుమార్, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ బీఎస్ఎం వల్లి, కార్మికశాఖ అధికారులు, బీమా కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

బ్యాంకు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

యూనియన్ బ్యాంకు ప్రాంతీయ కార్యాలయం ఎదుట ధర్నా


రాజమహేంద్రవరంలో ధర్నా చేస్తున్న బ్యాంకు ఉద్యోగులు

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): బ్యాంకు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని బ్యాంకు ఉద్యోగుల సంఘం జిల్లా కన్వీనర్ ఎన్.లక్ష్మీపతిరావు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం సాయంత్రం రాజమహేంద్రవరం కోటిపల్లి బస్టాండు యూనియన్ బ్యాంకు ప్రాంతీయ కార్యాలయం ఎదుట ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీపతిరావు మాట్లాడుతూ బ్యాంకింగ్ రంగంలో కొత్త నియామకాలు చేపట్టాలని, తాత్కాలిక ఉద్యోగుల నియామకాలు నిలిపివేయాలని అన్నారు. తమ సమస్యలు పరిష్కరించకపోతే రెండు రోజుల సమ్మెకు వెళ్లేందుకు సిద్ధమని అన్నారు. యూనియన్ నాయకులు శేషుకుమార్, పాపారావు మాట్లాడుతూ ఐదు రోజుల పనిదినాలు అమలు పర్చాలని, ఉద్యోగులకు ఇచ్చే సంక్షేమ ప్రయోజనాలపై ఇన్ కం ట్యాక్సు మినహాయింపు ఇవ్వాలని అన్నారు. మార్చి 3న పార్లమెంట్ నెదుట ధర్నా నిర్వహించనున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు ఉద్యోగులు శ్రీనివాస్, మురళీధర్, అప్పారావు, శేఖర్, స్వాతి, కీర్తన, సోమరాజు, రమేష్, వెంకటేశ్వరావు, ప్రజ్ఞ, తదితరులు పాల్గొన్నారు.

డెల్టా కాలువలకు 8850 క్యూసెక్కులు

ధవళేశ్వరం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ అవసరాల కోసం కాటన్ బ్యారేజ్ నుంచి డెల్టా కాలువలకు 8850 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. తూర్పు డెల్టా ప్రధాన పంట కాలువకు 2650 క్యూసెక్కులు, మధ్యడెల్టాకు 1800 క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 4400 క్యూసెక్కులు చొప్పున విడుదల చేస్తున్నారు. గోదావరిలో నీటి లభ్యత 8465 క్యూసెక్కులుగా ఉండగా, గోదావరి నీటి మట్టం 9.45 అడుగులుగా నమోదయింది

కుంతీమాధవుడి హుండీల లెక్కింపు



పిఠాపురం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణంలోని కుంతీమాధవ స్వామి దేవస్థానంలో హుండీలను శుక్రవారం లెక్కించారు. ఏడాది కాలానికిగానూ రూ.2లక్షల71వేల495 ఆదాయం లభించింది. లెక్కింపులో ఆలయ ఈవో నున్న శ్రీరాములు, దేవదాయశాఖ సిబ్బంది, కుంతీమాధవ భక్త బృందం సభ్యులు పాల్గొన్నారు.

రఘుదేవపురం పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శి సస్పెన్షన్

సీతానగరం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): గతంలో తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం రఘుదేవపురం పంచాయతీ ఇన్‌చార్జి కార్యదర్శిగా పనిచేసిన అప్పారావును సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు అందాయని ఈవోపీఆర్డీ కేవీఎస్ఎన్ మూర్తి శుక్రవారం తెలిపారు. 2023-24లో రఘుదేవపురం ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన అప్పారావు పంచాయతీ నిధులు రూ.15 లక్షలు దుర్వినియోగం చేసినట్టు ఫిర్యాదులు అందడంతో అతడిని సస్పెండ్ చేస్తూ పంచాయతీరాజ్ కమీషనర్ ఉత్తర్వులు జారీ చేసినట్టు తెలిపారు. సస్పెండ్ అయిన అప్పారావు ప్రస్తుతం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం కె.పెదపూడి పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వర్తిస్తున్నారని ఈవోపీఆర్డీ పేర్కొన్నారు.

సూట్‌కేస్ పోయిందని ఫిర్యాదు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఆవ రోడ్ అల్యూమినియం కాలనీకి చెందిన వి.దుర్గ తాను శుక్రవారం ఉదయం ఇంటి నుంచి తిరిగి వచ్చే సరికి ఇంటిలోని ఓ సూట్‌కేస్ కనబడడం లేదని టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ సూట్‌కేస్‌లో మూడు కాసుల బంగారు వస్తువులు, 250గ్రాముల వెండి ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ భావన

స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్‌ను విజయవంతం చేయాలి

నగరపాలక సంస్థ కమిషనర్ భావన

కార్పొరేషన్(కాకినాడ), ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ప్రతీనెలా మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని ప్రతీ ఒక్కరూ విజయవంతం చేయాలని ప్రజలను ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం చేయాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ భావన సూచించారు. శుక్రవారం ఈ కార్యక్రమంపై అన్ని విభాగాల ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. శనివారం స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. వీధులు, డ్రైన్లు, పబ్లిక్ టాయిలెట్లను శుభ్రపరచడం, పార్కుల్లో తుప్పల తొలగింపు, ప్రభుత్వ కార్యాలయాలను శుభ్రపరచడం వంటి కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సోర్స్-రిసోర్స్ థీమ్‌ను ఈ శనివారం కార్యక్రమంలో నిర్వహించనున్నారు. తడి, పొడి చెత్త, హానికరమైన చెత్తల సేకరణ, తడిచెత్తతో కంపోస్టు తయారీ, వ్యర్థాలు వేరు చేయడం ద్వారా సంపద సృష్టి కార్యక్రమాలపై అందరికీ అవగాహన కల్పించాలన్నారు. నగర ప్రజలు కూడా కాకినాడను పరిశుభ్రంగా ఉంచేలా అందరికీ అవగాహన కల్పించాలని సూచించారు. అడిషనల్ కమిషనర్ కేటీ సుధాకర్, డిప్యూటీ కమిషనర్ కె.మనోహర్, సెక్రటరీ శ్రీకాంత్‌రెడ్డి, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, ఎస్ఈ కామేశ్వరరావు, ఈఈ మత్స్యరాజు, టీపీఆర్వో శైలజ, మేనేజర్ సత్యనారాయణ, ఆర్‌వో శిరీష్ పాల్గొన్నారు.

రీ సర్వే సమగ్రంగా నిర్వహించాలి

● కాకినాడ ఆర్డీవో మల్లిబాబు

కాకినాడసిటీ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): డివిజన్‌లోని నిర్దేశించిన మండలాల్లో రీ సర్వే సమగ్రంగా నిర్వహించాలని, అదేవిధంగా ఇళ్ల స్థలాలకు సంబంధించి పూర్తిస్థాయి విచారణ చేసి నివేదిక రూపొందించాలని కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లిబాబు ఆదేశించారు. కాకినాడ రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో శుక్రవారం డివిజన్ పరిధిలోని తహసీల్దార్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రతి తహసీల్దార్ తమ కార్యాలయంలో 3వ శనివారం స్వచ్ఛ భారత్, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించాలన్నారు. రెవెన్యూ, వ్యవసాయ, ఉద్యానవనశాఖలు రైతు వివరాలు నమోదు కార్యక్రమం వేగవంతం చేయాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాలను సందర్శించి మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థలో అందిన అర్జీలను నిర్ణీత గడువులోగా చర్య తీసుకోవా లని ఆదేశించారు. కార్యాలయ పరిపాలనాధికారి డీబీఏ చైనులు, తహసీల్దార్లు వి.జితేంద్ర, పి.త్రినాధరావు, జీఆర్ ఠాగూర్, కె.చిన్నారావు, కె.సత్యనారాయణ, కె.చంద్రశేఖరరెడ్డి, ఎన్.సత్యనారాయణ, ఎస్ఎల్ఎన్ కుమారి పాల్గొన్నారు.



రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో మాట్లాడుతున్న ఆర్డీవో మల్లిబాబు

ప్రభుత్వ కళాశాల అభివృద్ధికి రూ.75లక్షలు

● దివీస్ లేబొరేటరీస్ ప్రకటన



డిగ్రీ కళాశాలకు సమకూర్చిన ఆర్వో ప్లాంటు

పిఠాపురం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): పిఠాపురం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు దివీస్ లేబొరేటరీస్ రూ.75లక్షలను ప్రకటించింది. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చొరవతో ఈ నిధులు సమకూరాయి. ఇందులో తొలివిడతగా రూ.20లక్షలతో కళాశాలకు కంప్యూటర్లు, ఫర్నీచర్, ఆర్వో ప్లాంటును సమకూర్చింది. మిగిలిన నిధులతో ఇతర సదుపాయాలు త్వరలోనే కల్పించనున్నారు. పట్టణంలోని పాదగయ చెంతనే బైపాస్‌రోడ్డుకు చేర్చి నూతనంగా నిర్మించిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల నూతన భవనాలను రెండు నెలల క్రితం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రారంభించారు. భవనాలు సమకూరినా అందులో ఫర్నీచర్, కంప్యూటర్ ల్యాబ్ ఇతర సౌకర్యాలు లేవని, కాంపౌండ్ వాల్ నిర్మించాలని అప్పుడు కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు పవన్‌ను కోరారు. దీంతో ఆయన స్పందించి ఇందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తోపాటు తన పేషీ అధికారులకు సూచించారు. వీటిని సమకూర్చేందుకు దివీస్ ల్యాబ్స్ ముందుకు వచ్చింది. సీఎస్ఆర్ నిధులు రూ.75 లక్షలతో కళాశాలకు కాంపౌండ్‌వాల్ నిర్మాణంతోపాటు ఇతర మౌలిక సదుపాయాలు కల్పిస్తామని సంస్థ ప్రకటించింది. తొలివిడతగా గురువారం దివీస్ సంస్థ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు 20 కంప్యూటర్లు, 20 డ్యూయల్ డెస్క్‌లు, 20 ఆఫీసు టేబుల్స్, 20కంప్యూటర్ టేబుల్స్, చైర్‌లు, ప్రిన్సిపాల్ టేబుల్‌తోపాటు వేయి లీటర్ల సామర్థ్యం కలిగిన ఆర్వో ప్లాంటును సమకూర్చారు. వీటిని గురువారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో దివీస్ ల్యాబ్స్ హెచ్‌ఆర్ సీనియర్ మేనేజరు ఆర్.సుధాకర్, వేల్ఫేర్ ఆఫీసర్ బి.వాసుబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కార్యాలయ ఓఎస్‌డీ ఎన్‌వీ శివరామప్రసాద్‌లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుభాషిణి, విద్యార్థులకు అందజేశారు. విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించిన దివీస్ ల్యాబ్స్ ప్రతినిధులు, డిప్యూటీ సీఎం పేషీ అధికారులకు ప్రిన్సిపాల్, విద్యార్థులు సత్కరించారు.

ప్రేమికుల రోజున రెచ్చిపోయిన ఆకతాయిలు

● విద్యార్థినుల పట్ల అసభ్య ప్రవర్తన

కరప, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రం కరపలో వాలంటైన్స్‌డే రోజున పలువురు ఆకతాయిలు రెచ్చిపోయారు. స్థానిక జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో చదువుతున్న పలువురు విద్యార్థినులు శుక్రవారం సాయంత్రం బస్సెక్కడానికి నిల్చోగా ఆకతాయిలు అక్కడకు వచ్చి వారిపట్ల అసభ్యంగా ప్రవర్తించారు. ఆకతాయిల అకృత్యాలపై స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అక్కడకు చేరుకున్న సిబ్బంది ఆటపట్టిస్తున్న పలువురిని పట్టుకునే ప్రయత్నంచేశారు.

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి

● జిల్లా ఎస్పీ బిందు మాధవ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ బింధుమాదవ్

కాకినాడ సిటీ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని, అలాగే రక్తదానం చేయడంవల్ల మరొకరికి ప్రాణదానం చేసిన వారవుతారని కాకినాడజిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ పేర్కొన్నారు. 36వ జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలలో భాగంగా శుక్రవారం జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో స్థానిక సంజయ్‌నగర్‌లోని కాకినాడ లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో ఉచిత వైద్య శిబిరం, రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎస్పీ బిందుమాధవ్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలవల్ల ఎక్కువమంది మృతి చెందుతున్నారన్నారు. వేగం తగ్గించి నిబంధనలు పాటించాలని సూచించారు. ముఖ్యంగా డ్రైవర్లు ఆరోగ్యంపట్ల శ్రద్ధ వహించాలని కోరారు. అంతకు ముందు ఎస్పీ రక్తదాన శిబిరం ప్రారంభించి రక్తదానంచేసి రక్తదాతలను ప్రోత్సహించారు. కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రి, రోటరీ క్లబ్, రెడ్ క్రాస్‌లకు సేకరించిన రక్తం అందించారు. రహదారి భద్రతా వారోత్సవాల క్విజ్ విజేతలకు మెమోంటోలు అంద జేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా అధికారి కె.శ్రీధర్, కాకినాడ డీఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్, డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్, ట్రాఫిక్ సీఐ ఎన్.రమేష్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బి.మురళీకృష్ణ, రోడ్ సేఫ్టీ సభ్యురాలు బోడపాటి కాంతం, డాక్టర్ పద్మావతి, కాకినాడ లారీఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దాసరి శ్రీనివాసరావు, కార్యదర్శి అల్లంరాజు, కోశాధికారి గణేశుల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు అడిగర్ల గంగబాబు, కుచ్చర్లపాటి అర్జున్‌రాజు, చిట్టిమేను సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులు, రవాణా, పోలీస్‌శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

73 మంది వాహనదారులపై కేసులు

కాకినాడ క్రైం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక ట్రాఫిక్1, 2 పోలీస్‌స్టేషన్ల ఆధ్వర్యంలో శుక్రవారం కాకినాడసిటీలోని భానుగుడిసెంటర్ నుంచి మెయిన్‌రోడ్డు ప్రధాన జంక్షన్‌ల వద్ద పలు ప్రాంతాల్లో వాహనాల ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈసందర్భంగా 73మంది వాహనదారులపై ఎంఈ చట్టం ప్రకారం ఈ చలానా ద్వారా కేసులు నమోదు చేశారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐలు ఎన్.రమేష్, డి.రామారావు, పోర్టు సీఐలు నాగదుర్గారావు, అప్పలనాయుడు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి

సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ ఈ ఆఫీస్‌లో సామర్థ్యాలను పెంచుకోవాలని జిల్లా ఎస్పీ బిందు మాధవ్‌కోరారు. శుక్రవారం కాకినాడజిల్లా పోలీసు కార్యాలయంలో ఈ ఆఫీస్ శిక్షణా తరగతులను ఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసుశాఖలో ఫైళ్లు, రికార్డులను సక్రమంగా నిర్వహించేందుకు డిజిటల్ కార్యాలయ పరిష్కారం ఈ ఆఫీసు అన్నారు. అంతా ఆన్‌లైన్‌లో జరిగే ప్రక్రియపై సమగ్ర అవగాహన చేసుకునేందుకు శిక్షణా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ ఆఫీస్ శిక్షణా కార్యక్రమాన్ని డీజీపీ హరిష్‌కుమార్‌గుప్తా ఆన్‌లైన్‌లో ప్రారంభించారు.

సైబర్ నేరాలు-మహిళల భద్రతపై అవగాహన

సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేసేందుకు అలాగే మహిళలు, చిన్న పిల్లలకు భద్రత కల్పించే నేపథ్యంలో వీడియో ప్రదర్శన ద్వారా ఎస్పీ జి.బిందుమాధవ్ ఆధ్వర్యంలో కాకినాడ ఆశ్రమ్‌పబ్లిక్ స్కూల్‌లో శుక్రవారం ప్రత్యేక అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్పీ ప్రస్తుత సమాజంలో వివిధ రూపాలలో జరుగుతున్న ఆన్‌లైన్ మోసాలకు గురయ్యే వారు రక్షణ పొందడం ఎలా అనే సందర్భాన్ని బాలబాలికలకు వివరించారు. ఆశ్రమ్ పబ్లిక్ స్కూల్ డీన్ ఉమామహేశ్వరరావు, హెచ్ఎం చైతాలి, ప్రిన్సిపాల్ టి.అగస్టీన్, ఎస్‌డీపీవో మనీష్‌దేవరాజ్ పాటిల్ పాల్గొన్నారు.

అత్యధిక మెజార్టీతో రాజశేఖర్‌ని గెలిపిద్దాం

● ఎమ్మెల్యే పంతం నానాజీ

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కాకినాడరూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ కోరారు. శుక్రవారం వాకలపూడి, సర్పవరం గ్రామాల్లో పార్టీ నాయకులు, గ్రాడ్యుయేట్లతో నిర్వహించిన ఎన్నికల అవగాహన, ప్రచారంలో శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, అబ్బర్ల సుధాకర్, కూటమి నాయకులు కటకంశెట్టి ప్రభాకర్ (బాబీ), పుల్ల శ్రీరాములు, నులుకుర్తి వెంకటేశ్వరరావు, మామిడాల శ్రీనివాసరావు, ప్రసంగించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఫిబ్రవరి 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలన్నారు. కార్యక్రమంలో కూటమి పార్టీ నాయకులు ముద్దన ప్రకాశ్‌రావు, మాదారపు తాతాజీ, శిరంగు శ్రీనివాసరావు, తాటికాయల వీరబాబు, పలివెల త్రిమూర్తులు, ఆర్ సీతయ్యదొర, శ్రీనివాస్, రామకృష్ణ, సలాది శ్రీనివాసబాబా, గంటా ప్రసాద్ పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థికి అండగా నిలవండి


గొల్లప్రోలు రూరల్: ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు అండగా నిలిచి ప్రథమ ప్రాధాన్యం ఓటువేసి గెలిపించాలని అనకాపల్లి, పిఠాపురం మాజీ ఎమ్మె ల్యేలు పీలా గోవిందు సత్యనారాయణ, ఎస్వీఎస్ఎన్ వర్మలు కోరారు. గొల్లప్రోలు మండలం తాటిపర్తిలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ పాఠశాలలు, ప్రైవేటు విద్యాసంస్థలు, సచివాలయాల్లో ప్రచారం నిర్వహించి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓట్లను అభ్యర్థించారు.

టీడీపీ నాయకుల ప్రచారం


సామర్లకోట: ఎమ్మెల్సీ ఎన్డీఏ అభ్యర్థిగా బరిలో ఉన్న పేరాబత్తుల రాజశేఖర్‌గెలుపు కోరుతూ సామర్లకోట మండలం హుస్సేన్‌పురం గ్రామంలో టీడీపీ నాయకులు చల్లా బుజ్జి ఆధ్వర్యంలో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. గ్రామంలో గ్రాడ్యుయేట్ ఓటర్లు సుమారు 100 మందికి పైబడి ఉండడంతో వారిని టీడీపీ శ్రేణులందరూ కలిసి రాజశేఖర్‌కు తొలిప్రాధాన్యతా ఓటును వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈసందర్భంగా టీడీపీ అభ్యర్థి రాజశేఖర్ కు మద్దతుగా ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. కోట అప్పారావు, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విజయమే ధ్యేయంగా పనిచేయాలి

కరప: పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా కూటమి ప్రభుత్వం బలపరిచిన పేరాబత్తుల రాజశేఖర్ విజయానికి అందరూ పనిచేయాలని టీడీపీ కాకినాడరూరల్ ఎన్నికల సమన్వయకర్త నులుకుర్తి వెంకటేశ్వరరావు సూచించారు. మండలంలోని నడకుదురు, గురజనాపల్లి, పెనుగుదురు, కొరుపల్లి, జడ్.బావారం, గొడ్డటిపాలెం, అరట్లకట్ట గ్రామాల్లో శుక్రవారం కూటమి నాయకులతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. గ్రాడ్యుయేట్ ఓటర్లను కలుసుకుని కరపత్రాలు పంపిణీచేశారు. ఈ ప్రచారంలో టీడీపీ, జనసేన మండలాధ్యక్షులు దేవు వెంకన్న, బండారు మురళి, ముమ్మిడి పుష్పలత, కోన వెంకటలక్ష్మి, యాసలపు విష్ణు పాల్గొన్నారు.



సర్పవరంలో గ్రాడ్యుయేట్ ఓటర్లకు కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే పంతం నానాజీ



గొల్లప్రోలు: తాటిపర్తిలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు పీలా గోవిందు, వర్మలు

ఘనంగా సంజీవయ్య జయంతి





కాకినాడలో దామోదరం సంజీవయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ బిందు మాధవ్, సామర్లకోటలో కమిషనర్ శ్రీవిద్య దామోదరం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

కాకినాడ క్రైం, ఫిబ్రవరి 14 (ఆంధ్ర జ్యోతి): కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఏపీ రెండవ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయం తి ఘనంగా నిర్వహించారు. దామోదరం చిత్రపటానికి పూలమాలలువేసి జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎంజే వీ భాస్కరరావు, ఏఎస్పీ ఏఆర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోట: ఆంధ్రప్రదేశ్ రెండవ ముఖ్యమంత్రిగా విశేష సేవలందించిన దామోదరం సంజీవయ్య సేవలు చిరస్మరణీయమని సామర్లకోట మున్సిపల్ కమిషనర్ అనిశెట్టి శ్రీవిద్య పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు దామోదరం సంజీవయ్య జయంతిని శుక్రవారం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. ముందుగా దామోదరం సంజీవయ్య చిత్రపటానికి కమిషనర్ పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ శశిధర్, ఏఈ శ్రీనివాసు, టీపీవో మంజుల ఆర్ఐ శ్యామల తదితర అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే సామర్లకోట అయోధ్యరామపురం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో దామోదరం సంజీవయ్య జయంతిని పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల సమక్షంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు తోటకూర సాయిరామకృష్ణ, ఎంఈవో పట్టపగలు పుల్లయ్య ఆధ్వర్యంలో సంజీవయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

సారా బట్టీలపై పోలీసుల దాడి

కొత్తపల్లి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): పొన్నాడ శివారు కోనపాపపేటలో నాటుసారా బట్టీలపై కొత్తపల్లి పోలీసులు శుక్రవారం దాడు లు చేశారు. సుమారు 100 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. బట్టీల వద్ద 10 లీటర్ల నాటు సారాతో పిల్లి భూషణంను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపామని కొత్తపల్లి ఎస్ఐ జి.వెంకటేష్ చెప్పారు.

అమర జవానులకు ఘన నివాళి

పెద్దాపురం (సామర్లకోట), ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పుల్వామా ఉగ్రదాడి జరిగి నేటికి మూడు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా అమరులైన వీరజవాన్లను స్తుతిస్తూ పెద్దాపురం మండలం దివిలి గ్రామంలో శుక్రవారం గ్రామ యూత్ నాయకులు, కార్యకర్తలచే ఘన నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా టీడీపీ పెద్దాపురం మండల అధ్యక్షుడు కొత్తెం వెంకటశ్రీనివాసరావు హాజరై మాట్లాడుతూ దేశ ప్రతిష్టలు కాపాడేందుకు సరిహద్దు ప్రాంతాల్లో తమ ప్రాణాలను సైతం తృణంగా త్యజించిన వీరజవాన్లసేవలను అందరూ గుర్తుంచుకోవాలని కోరారు. అమర జవాన్ల చిత్రపటానికి నివాళులర్పించారు. మెయిళ్ళ కృష్ణమూర్తి, తుమ్మల నాని, రేలంగి బుజ్జి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే పుల్వామా దాడులలో అమరులు అయిన వీరజవాన్లను స్తుతిస్తూ పెద్దాపురం ఎస్ఐ మౌనిక ఆధ్వర్యంలో పలువురు మహిళలు, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పెద్దాపురంలో శుక్రవారం రాత్రి కొవ్వొత్తులతో పాదయాత్ర నిర్వహించారు.

వీర జవాన్లకు ఘన నివాళి

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : కాశ్మీర్ జిల్లా శ్రీనగర్ జాతీయ రహదారిపై కాన్వాయ్‌తో వెళుతోన్న భారత్ సీఆర్‌పీఎఫ్ వాహనంపై ఉగ్రవాదులు జరిపిన దాడుల్లో మృతి చెందిన భారత్ సైనికులకు ఘనంగా నివాళులర్పించారు. శుక్రవారం సర్పవరం జంక్షన్‌లో బీజేపీ పార్లమెంట్ కన్వీనర్ రంబాల వెంకటేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు నందూరి సత్తిబాబుల ఆధ్వర్యంలో పుల్వామా దాడిలో అమరులైన వీర జవాన్లకు కొవ్వొత్తుల ర్యాలీతో ఘనంగా నివాళులర్పించారు. పార్టీ అసెంబ్లీ కన్వీనర్ పితాని లీలావతి, బల్ల సుధాకర్, బి రామకృష్ణ, పిసత్యనారాయణ,అన్నపూర్ణ, విజయలక్ష్మి, పి.అరుణ్‌ప్రకాశ్ పాల్గొన్నారు.



దివిలిలో యూత్ ఆధ్వర్యంలో అమరజవానులకు నివాళులర్పిస్తున్న దృశ్యం

విస్మరించిన ఎన్నికల ప్రవర్తనా నియమావళి

సామర్లకోట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి):ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని సక్రమంగా అమలుచేయడంలో సాక్షాత్తూ సామర్లకోట ఎంపీడీవో కార్యాలయ అధికారులే విస్మరించడంపట్ల పలు రాజకీయపార్టీల నాయకులు విస్మయం చెందుతున్నారు. ఎక్కడో మారుమూల గాకుండా సామర్లకోట ఎంపీడీవో కార్యాలయం భవనానికి వైసీపీ పార్టీకి చెందిన ఎంపీపీ ఫోటో ను మూసివేయకుండా కొన్ని పేర్లను మాత్రమే మూసి వేసి ఫోటోనే యథాతథంగా ఉంచడంపట్ల ప్రభుత్వ అధికారు లు నియమావళి ఉల్లంఘించారని కూటమిపార్టీల నాయకు లు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం మారినా అధికారులు నేటికీ వైసీపీ ప్రజాప్రతినిధులకు కొమ్ముకాయడాన్ని టీడీపీనాయకులు జిల్లా ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

వైద్య విద్యార్థులకు జనసేన ఆర్థిక సాయం

పిఠాపురం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఫీజులు చెల్లించలేని వైద్య విద్యార్థులకు జనసేన ఎన్ఆర్ఐ విభాగం సమన్వయకర్త కొలికొండ శశిధర్ అండగా నిలిచారు. పిఠాపురం నియోజకవర్గానికి చెందిన వైద్య విద్యార్థులు ఎర్రవరపు మౌనిక, రాయి శ్యామ లలు కుటుంబ పరిస్థితులరీత్యా ఫీజులు చెల్లించలేని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. వీరి విషయాన్ని జనసేన స్థానిక నాయకులు ద్వారా తెలుసుకున్న శశిధర్ ఒకొక్కరికీ లక్ష రూపాయలు అందజేస్తానని ప్రకటించారు. మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఈ మొత్తాలను విద్యార్థినులకు అందజేశారు. కార్యక్రమంలో జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, నాయకులు చెల్లుబోయిన సతీష్, నాగేశ్వరరావు, తెలగంశెట్టి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మద్యానికి దూరంగా ఉండాలి

గొల్లప్రోలు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మద్యం వలన కుటుంబ ఆర్థిక పరిస్థితులు, జీవితాలు చిన్నాభిన్నమవుతాయని, దానికి దూరంగా ఉండాలని మద్యపాన వ్యతిరేక ప్రచారకమిటీ, జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు సూచించారు. గొల్లప్రోలు పట్టణంలో ఇటీవల మద్యానికి అలవాటు పడి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన బర్రె శ్రీను కుటుంబాన్ని వారు శుక్రవారం సాయంత్రం పరామర్శించి వారికి నిత్యావసర సరుకులు, గుడ్లు తదితరాలను అందజేశారు. కార్యక్రమంలో ఆయా కమిటీల ప్రతినిధులు డాక్టర్ ఎన్.సూర్యనారాయణ, దాడి పద్మనాభం, కరణం విశ్వనాథం, గుర్రాల ప్రసాద్, యేలేటి నానిబాబు, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పావని తదితరులు పాల్గొన్నారు. బర్రె శ్రీను ఆత్మహత్యాయత్నానికి పాల్పడినప్పుడు ధైర్యంగా ఆసుపత్రికి తరలించిన యువకుడు బి.నవీన్‌ను వారు అభినందించారు.

వైభవంగా శ్రీపుష్పయాగం

పిఠాపురం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): దేశంలోని పంచమాధవ క్షేత్రాల్లో ఒకటిగా విరాజిల్లుతున్న పిఠాపురం పట్టణంలోని కుంతీమాధవస్వామి దేవస్థానంలో జరుగుతున్న కల్యాణోత్సవాలు ముగిశాయి. చివరిరోజు స్వామివారి శ్రీపుష్పయాగం వైభవంగా జరిగింది.

చోరీ కేసులో నిందితుడికి ఏడాది జైలు

పిఠాపురం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): చోరీ కేసులో నిందితుడికి ఏడాది జైలు శిక్ష విధిస్తూ పిఠాపురం ప్రిన్సిపల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ ఎం.విజయరామేశ్వరి తీర్పు చెప్పారు. పిఠాపురం పట్టణంలోని లయన్స్‌క్లబ్ ఏరియాలోని ఇంటిలోకి ప్రవేశించి పెద్దాపురం మండలం ఉలిమేశ్వరానికి చెందిన ఎండపల్లి సూరిబాబు బంగారం నగలు, నగదు చోరీకి పాల్పడ్డాడు. 2022లో జరిగిన ఈ సంఘటనపై అప్పటి పిఠాపురం పట్టణ ఎస్ఐ శంకరరావు కేసు నమోదుచేసి నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. నేరం రుజువు కావడంతో జైలుశిక్ష విధించారు. ఏపీపీ ఆకుల లీలా నాగరోజా ప్రాసిక్యూషన్ నిర్వహించగా, కానిస్టేబుల్ ఖరీం సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు.

'తప్పుడు ఆరోపణలతో ఇబ్బంది పెడుతున్నారు'

సర్పవరం జంక్షన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : డ్వాక్రా సంఘాలకు చెందిన రూ. 2 కోట్లతో పరారైనట్లు కొంతమంది తనపై తప్పుడు ప్రచారం చేసి ఇబ్బంది పెడుతున్నారని, వెలుగు అధికారులు నిర్వహించిన నివేదిక బహిర్గతం చేయాలి పి.వెంకటాపురం యానిమేటర్ (వీవోఏ) వల్లు కనకమహాలక్ష్మి డిమాండ్ చేసింది. శుక్రవారం పి.వెంకటాపురంలో విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలో ఉన్న 28 డ్వాక్రా సంఘాల నిర్వహణ బాధ్యతలను చూస్తున్నానన్నారు. శ్రీసత్యసాయి గ్రూపు సభ్యులకు రూ. 15లక్షలు రుణంగా బ్యాంకు మంజూరు చేసిందన్నారు. సభ్యుల పాత అప్పుకింద రూ. 2.20 లక్షలు బ్యాంకుకి కట్టగా, మిగతా రూ. 12.80 లక్షలు బ్యాంకు నుంచి విత్‌డ్రా చేసి ఆటోలో వస్తోండగా, రూ. 5లక్షలు ఆటోలో ఉండగా చోరీకి గురవ్వడం జరిగిందన్నారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశానన్నారు. మిగతా డబ్బులు రూ.7.80లక్షలు సభ్యులు రుణాలుగా తీసుకునేందుకు నిరాకరించడంతో బ్యాంకులో డిపాజిట్ చేశామన్నారు. శివశక్తిగ్రూపు శ్రీనిధికి సంబంధించి రూ. 50 వేలు నిధులు దుర్వినియోగం అయినట్లు సభ్యులు ఆరోపించారన్నారు. ఈ మొత్తం వ్యవహారంపై డీఆర్‌డీఏ అధికారులు విచారణ నిర్వహించి, రూ.13.30 లక్షలు సంఘం నిధులు దుర్వినియోగం అయినట్లు తెలిపామన్నారు. ఇందులో రూ. 7.80 లక్షలు బ్యాంకులో ఉన్నాయన్నారు. విచారణ నివేదిక ఇవ్వాలని అధికారులను కోరగా వారు ఇచ్చిన వెంటనే కొంతమంది ఆ నివేదికను బలవంతంగా పట్టుకుపోయి, ఇప్పుడు రూ.2 కోట్లతో యానిమేటర్ పరారైనట్లు అసత్య ఆరోపణలు చేస్తూ మనోవేధనకు గురిచేస్తున్నారన్నారు. నివేదిక తనకు ఇచ్చి, తాను నిధులు దుర్వినియోగచేసినట్లు రుజువు చేస్తే మొత్తం సొమ్ము కట్టేస్తానని, తప్పుడు ఆరోపణలు చేయడం తగదన్నారు.

ఎండీయూ ఆపరేటర్ సత్యానందం తిరిగి నియామకం

సామర్లకోట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎండీయూ ఆపరేటర్‌గా పనిచేస్తున్న దర్శిపాటి సత్యానందంపై ఉన్న సస్పెన్షన్ ఉత్తర్వులను ఉపసంహరించి తిరిగి నియమిస్తూ కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లిబాబు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసినట్లు సామర్లకోట తహశీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి శుక్రవారం రాత్రి విలేకరులకు తెలిపారు. గతంలో ఎండీయూ ఆపరేటర్ సత్యానందం ఎంఎస్వో అధికారికి సొమ్ములు ఇవ్వాలంటూ సహచర ఆపరేటర్ల వద్ద, రేషన్ డీలర్ల వద్ద వసూళ్ళు చేసాడన్న ఆరోపణలపై సత్యానందంను సస్పెన్షన్ చేసిన విషయం విధితమే. దీనిపై ఆర్డీవో ఆదేశాల మేరకు విచారణలు జరిపిన అనంతరం తిరిగి ఇటువంటి తప్పులు తిరిగి పునరావృతం అయితే టెర్మినేట్ చేయడం తప్పదని హెచ్చరిస్తూ ఆర్డీవో మల్లిబాబు ఆపరేటర్ సత్యానందంపై ఉన్న సస్పెన్షన్ ఉత్తర్వులు ఉపసంహరించుకున్నట్లు ఉత్తర్వులు జారీ చేసారని తహశీల్దార్ చంద్రశేఖరరెడ్డి తెలిపారు.

బాధ్యతాయుతమైన ప్రతిపక్ష పాత్ర పోషిస్తాం

● వైసీపీ జిల్లా అధ్యక్షుడు దాడిశెట్టి రాజా

పిఠాపురం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేసే తప్పులను ప్రశ్నిస్తూ బాధ్యతాయుతమైన ప్రతిపక్ష పాత్ర పోషిస్తామని వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి దాడిశెట్టి రాజా తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన అనంతరం శుక్రవారం తొలిసారి పిఠాపురం నియోజకవర్గానికి ఆయనకు వైసీపీ కార్యాలయం వద్ద కాకినాడ మాజీ ఎంపీ, నియోజకవర్గ వైసీపీ కోఆర్డినేటర్ వంగా గీతా విశ్వనాథ్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు స్వాగతం పలికారు. అనంతరం రాజా మాట్లాడుతూ ప్రశ్నించే వారిని వేధించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వ పాలన సాగుతోందని విమర్శించారు.

సర్వేలో నిర్లక్ష్యం వహిస్తే సస్పెన్షన్

గొల్లప్రోలు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఎంఎస్ఎంఈ సర్వే నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సస్పెన్షన్ తప్పదని గొల్లప్రోలు నగరపంచాయతీ కమిషనర్ నామా కనకారావు హెచ్చరించారు. నగరపంచాయతీ కార్యాలయంలో శుక్రవారం సర్వే నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. చిన్నతరహా పరిశ్రమలు, యూనిట్లు, వ్యాపారసంస్థలు తదితరాలపై నిర్వహిస్తున్న సర్వేను వేగవంతం చేయాలని సూచించారు. అన్ని వివరాలు సేకరించాలని చెప్పారు.

స్వమిత్వ సర్వే తనిఖీ

కిర్లంపూడి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామకృష్ణాపురం పంచాయతీలో జరుగుతున్న స్వమిత్వ సర్వేను జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్, డివిజనల్ పంచాయతీ అధికారి బాలామణి శుక్రవారం తనిఖీ చేశారు. సర్వేపై సంతృప్తి వ్యక్తం చేశారు. సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించి పలు సూచనలు చేశారు. వారి వెంట పంచాయతీ విస్తరణాధికారి ఎస్.సత్యప్రసాద్, పంచాయతీ కార్యదర్శి సతీష్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా రుక్మగడయ్య

రంపచోడవరం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ శాఖ రంపచోడవరం డిప్యూటీ డైరెక్టరుగా ఎం.రుక్మగడయ్యను బదిలీ చేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. గత కొన్నేళ్లుగా ఇక్కడి డిప్యూటీ డైరెక్టర్ పోస్టు ఖాళీగా ఉండి ఇన్‌చార్జిలతో నడుస్తోంది. గతంలో పాడేరు డిప్యూటీ డైరెక్టరుగా ఉండి ఇక్కడికి బదిలీపై వచ్చిన కొండలరావు బాధ్యతలు చేపట్టి, చేపట్టకుండానే వెనక్కు వెళ్లారు. దీంతో మరలా ఇన్‌చార్జిల పాలనలోనే కొనసాగింది. గిరిజన సంక్షేమ విద్యా వ్యవహారాలు, విద్యాలయాల నిర్వహణకు సంబంధించి రంపచోడవరం, చింతూరు ఐటీడీఏల పరిధిలో రెగ్యులర్ అధికారి లేకపోవడంతో ఎదురువుతున్న ఇబ్బందికర పరిస్థితులపై గిరిజన సంక్షేమ రాష్ట్ర సంచాలకులు ఇచ్చిన నివేదిక ఆధారంగా ప్రభుత్వం రంపచోడవరం డిప్యూటీ డైరెక్టరుగా రెగ్యులర్ అధికారిని నియమించారు. సంచాలకుల కార్యాలయంలో పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న రుక్మగడయ్యను రంపచోడవరం డిప్యూటీ డైరెక్టరుగా బదిలీ చేశారు. కొండలరావును గిరిజన సబ్ ప్లాన్ డిప్యూటీ డైరెక్టరుగా విజయవాడ బదిలీ చేస్తూ గిరిజన సంక్షేమ కార్యదర్శి ఎంఎం నాయక్ ఉత్తర్వులు జారీ చేశారు.



ఎటపాక మండలం తోటపల్లిలో ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి రాజశేఖరానికి మద్దతుగా ప్రచారం

మోతుగూడెం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరానికి మద్దతుగా వై.రామవరం మండలం డొంకరాయిలో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులను కలిసి రాజశేఖరానికి మొదటి ప్రాధాన్య ఓటు వేయాలని కోరారు. ప్రచారంలో డొంకరాయి ఎంపీటీసీ కరకా వెంకటరమణ, టీడీపీ సీనియర్ నాయకులు నీలపు సత్యనారాయణ, గుర్రప్ప, అనిల్, త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

దేవీపట్నం (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరానికి మద్దతుగా మండలంలోని ఇందుకూరు, కొండమొదలు గ్రామాల్లో టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు మరిశెట్ల వెంకటేశ్వరరావు (బుజ్జి) ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి ఓట్లు అభ్యర్థించారు. బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు కారం రామన్నదొర, కుంజం శివదొర, మలుగుల శ్రీనివాస్, సాయిరాం, రేలంగి రాంబాబు, గణేష్, తరుణ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఎటపాక (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరాన్ని గెలిపించాలని కోరుతూ తోటపల్లి, సీతాపురం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లభనేని చందు, నియోజకవర్గ ఏరియా కో-ఆర్డినేటర్ బాచినేని శ్రీకాంత్, దుద్దుకూరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.



వై.రామవరం మండలం డొంకరాయిలో...



దేవీపట్నం మండలంలో...

అరకొర భోజనాలపై డ్వాక్రా మహిళల అసంతృప్తి

వై.రామవరం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): వై.రామవరం మండల పరిషత్ కార్యాలయంలో 'పీసా' శిక్షణకు వచ్చిన మహిళలు భోజనాలు సరిపోక ఇంటి దారి పట్టారు. శిక్షణకు పీసా అధ్యక్ష, ఉపాధ్యక్ష, కార్యదర్శులు, ప్రజాప్రతినిధులతో పాటు పలువురిని విడతల వారీగా అధికారులు పిలుస్తున్నారు. వారితో పాటు డ్వాక్రా మహిళలను కూడా ఆహ్వానించారు. ఎంపీడీవో రవికిషోర్ ఆధ్వర్యంలో ఈటీసీ వైస్ ప్రిన్సిపాల్ చక్రపాణి (సామర్లకోట) శిక్షణ ఇచ్చారు. శుక్రవారం వచ్చిన మహిళల్లో చాలా మంది అరకొర భోజనాలతో ఇబ్బందిపడ్డారు. దీనిపై ఎంపీడీవో రవికిషోర్‌ను వివరణ కోరగా .... ఒక్కో సంఘం నుంచి ఒకరికి మాత్రమే ఆహ్వానం పంపగా... ఐదు, అంతకు మించి సభ్యులు వచ్చారన్నారు. తాము సుమారు 87 మందిని పిలవగా 150 మందికి పైగా రావడంతో భోజనాలు సరిపోలేదన్నారు.



వెనుతిరిగి వెళ్లిపోతున్న మహిళలు

విద్యతో పాటు ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి: ఐటీడీఏ పీవో

మారేడుమిల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు విద్యతో పాటు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను పరిశీలించారు. పారిశుధ్య నిర్వహణ, భోజనం, ఉపాధ్యాయుల బోధనా తీరుపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు అనారోగ్యానికి గురైతే ఆసుపత్రికి తీసుకువెళ్లి వైద్య పరీక్షలు చేయించాలన్నారు. పాఠశాలకు కూరగాయలు, నిత్యావసర సరుకుల సరఫరాపై ఆరా తీశారు.



ఏకలవ్య పాఠశాలలో విద్యార్థులతో కలిసి పాఠాలు వింటున్న ఐటీడీఏ పీవో సింహాచలం

హెచ్‌ఎం కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

రాజవొమ్మంగి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గింజర్తి మండల పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పూసం సత్యనారాయణదొర (46) కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందారు. విద్యా శాఖాధికారులు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. మట్టి ఖర్చుల నిమిత్తం రూ.25వేలను రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి అందించారు. టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు గొల్లపూడి పెద్దిరాజు, ఎంఈవోలు సత్యనారాయణదొర, సూర్యరెడ్డి పాల్గొన్నారు.



హెచ్‌ఎం కుటుంబానికి సాయం అందిస్తున్న ఎమ్మెల్యే

'పీసా' చట్టంపై అవగాహన

రాజవొమ్మంగి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): షెడ్యూల్ ఏరియాల్లో గిరిజన, గిరిజనేతరులు పీసా చట్టంపై అవగాహన కలిగి ఉండాలని ఏపీఎస్ఐ ఆర్డీ పరిశీలనాధికారి రమేష్ కోరారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల సిబ్బంది, స్వయం సహాయక బృందాల సభ్యులకు పీసా చట్టంపై శిక్షణ ఇచ్చారు. సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్రం నుంచి వచ్చిన అబ్జర్వర్ పద్మజ మాట్లాడుతూ ఈ చట్టంపై అవగాహన కల్పించుకోవాలన్నారు. ఎంపీడీవో యాదగిరేశ్వరరావు పీసా చట్టం ఆవశ్యకతను వివరించారు. ఎంవోటీ ఎ.కోటేశ్వరరావు, కార్యదర్శులు కోనేటి రాంబాబు, రొంగల కిషోర్, సుమర్ల రాంబాబు, గోవిందరాజు, కె.బాలురెడ్డి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



పీసా చట్టంలోని అంశాలను వివరిస్తున్న పరిశీలనాధికారి రమేష్

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

ఘనంగా అడవి రాజులుబాబు పండుగ







కోటనందూరు: జగన్నాథపురంలోజాతరగా వెళ్తున్న దృశ్యం, తునిరూరల్: భక్తులకు దర్శనమిస్తున్న దేవతామూర్తులు రౌతులపూడి: వనంలోకి తరలి వెళ్తున్న ప్రజలు

కోటనందూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలో అడవి రాజులబాబు పండుగను శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. లవకుశలను అరాధించే ఈ పండుగను మండలంలోని జగన్నాథపురం, అల్లిపూడి, ఎస్‌అర్‌పేట, బిళ్లనందూరు తదితర గ్రామాల్లో జరుపుకున్నారు. జగన్నాథపురంలో అన్నదానంతో పాటు సాంస్కృతిక ప్రదర్శలు నిర్వహించారు.

మొక్కులు చెల్లించారు

తుని రూరల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): తేటగుంట గ్రామంలో గిరిజన ఆరాధ్య దైవంగా పూజలు అందుకుంటున్న అడవి రాజులుబాబు పండుగ శుక్రవారం అట్టహాసంగా జరిగింది. ఈవేడుకల్లో వేలాది మంది భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

సహపంక్తి భోజనాలు

రౌతులపూడి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): రౌతులపూడి మండలంలోని లచ్చిరెడ్డిపాలెం గ్రామంలో శుక్రవారం అడవి రాజులుబాబు పండుగను గ్రామస్తులు ఘనంగా జరిపారు. గ్రామంలో ప్రజలంతా కుటుంబ సభ్యులతో కలిసికట్టుగా గ్రామ శివారు ఉన్న వనంలోకి వెళ్లారు. అక్కడ రాజులుబాబుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొక్కులు చెల్లించుకున్నారు. తోటల్లో వంటలు చేసుకుని కుటుంబ సభ్యులతో సహపంక్తి భోజనాలు చేశారు. ప్రతి సంవత్సరం మాఘమాసం పౌర్ణమి తరువాత వచ్చే శుక్రవారం ఈపండుగను చేసుకోవడం ఆచారంగా వస్తుందని గ్రామస్తులు తెలిపారు.

వనదుర్గ ఆలయంలో చండీ హోమం



అన్నవరం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి క్షేత్రరక్షకిగా పూజలందుకుంటున్న వనదుర్గ ఆలయంలో శుక్రవారం చండీ హోమం జరిగింది. ఉదయం 9 గంటలకు వేదపండితులు గణపతి పూజ నిర్వహించారు. అనంతరం అమ్మవారికి చండీ, సప్తసతి పారాయణలు, మూలమంత్ర జపాలు పఠించారు. పవిత్ర హోమగుండంలో 11గంటలకు సుగంధ ద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు. చతుర్వేద పండితుల వేదాశీర్వచనాల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

స్వచ్ఛ దివస్ దిశగా అడుగులు

ఏలేశ్వరం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ దివస్ దిశగా ప్రతి ఒక్కరూ అడుగులు వేయాలని ఎంపీడీవో సూర్యనారాయణ అన్నారు. శుక్రవారం మండలంలోని రమణయ్యపేట, యర్రవరం గ్రామాల్లో పంచాయతీ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు రోడ్డుకి ఇరువైపులా ఉన్న చెత్తను, తుప్పలను తొలగించారు. కార్యక్రమంలో అధికారులు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'పరాకాష్టకు చేరిన వైసీపీ నేతల ఒంటెద్దు పోకడలు'

టీడీపీ పట్టణ అధ్యక్షుడు సత్యనారాయణ

తుని రూరల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): తునిలో వైసీపీ నాయకుల పోకడ పరాకాష్టకు చేరిందని ఫలితంగా ఆ పార్టీ కౌన్సిలర్లతో పాటుగా వందలాది మంది కార్యకర్తలు టీడీపీ వైపు చూస్తున్నట్లు టీడీపీ పట్టణ అధ్యక్షుడు యినిగంటి సత్యనారాయణ తెలిపారు. గత నాలుగేళ్లలో వార్డుల్లో అభివృద్ధి కనిపించకపోవడంతో వైసీపీ కౌన్సిలర్లు తమకు టచ్‌లోకి వచ్చారని, తుని పట్టణాన్ని అభివృద్ధిబాటలో నడిపిస్తున్న ఎమ్మెల్యే యనమల దివ్య వెంట తాము నడిచేందుకు సానుకూలమని తుని మున్సిపల్ కౌన్సిలర్లు సంకేతాలు పంపించడం శుభ పరిణామం అన్నారు. తుని కూటమి కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఇప్పటికే ముగ్గురు టీడీపీలోకి చేరారని, మరో 14మంది నేడు టీడీపీలోకి చేరబోతున్నారని తెలిపారు. ప్రశాంత వాతావరణంలో తుని మున్సిపల్ వైస్ చైర్మన్ ఎన్నిక జరిపించేందుకు ఎమ్మెల్యే దివ్య ఇప్పటికే అధికారులకు ఆదేశాలు ఇచ్చారన్నారు. మున్సిపల్ మాజీ కౌన్సిలర్ కుక్కడపు బాలాజీ, మల్ల గణేష్, సిద్ధాంతపు సత్తిబాబు పాల్గొన్నారు.

మాజీ సీఎం సంజీవయ్యకు నివాళి

గండేపల్లి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి జరిపారు. ఎంపీడీవో నాతి బుజ్జి ఆధ్వర్యంలో సంజీవయ్య చిత్రపటానికి ఉద్యోగులు పూలమాలలువేసి నివాళులర్పించారు. 2019 ఫిబ్రవరి 14న జమ్మూకశ్మీర్‌లో జరిగిన ఆత్మాహుతి బాంబు దాడిలో మృతి చెందిన వీరజవానులకు పలువురు నివాళులర్పించారు. మండల పరిషత్, ఉపాధి హామీ, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

12 కొత్త జంటలకు 'పెళ్లి కానుక' అందజేత



పెళ్లి కానుకలు అందజేస్తున్న జ్యోతుల నవీన్

జగ్గంపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక రావులమ్మ నగర్‌లోని టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ 12 జంటలకు జ్యోతుల నెహ్రూ ఫౌండేషన్ తరఫున పెళ్లి కానుకలను శుక్రవారం అందించారు. గండేపల్లి మండలానికి చెందిన నాలుగు, జగ్గంపేట మండలానికి చెందిన రెండు, కిర్లంపూడి మండలానికి చెందిన మూడు, గోకవరం మండలానికి చెందిన మూడు జంటలకు.... ఒక్కోజంటకు రూ.20వేలు చొప్పున మొత్తం రూ.2.40లక్షలు అందజేశారు. కార్యక్రమంలో చదరం చంటిబాబు, బుర్రి సత్తిబాబు అనుకుల శ్రీకాంత్, పైడిపాల సూరిబాబు, పాఠంశెట్టి మురళీకృష్ణ, బద్ది సురేష్, కాళ్ల వెంకటేష్, నకిరెడ్డి సూర్యావతి, గద్దె మారుతి, సియాదుల పెద్దకాపు, మురా సత్తిబాబు, పుర్రె సూరన్న, బూరుగుపూడి బుజ్జి, మల్లేపల్లి భద్రరావు తదితరులు పాల్గొన్నారు.

కొబ్బరి చెట్ల బీమా పథకంపై అవగాహన

తునిరూరల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): కొబ్బరి రైతులు అకాల నష్టాల నుంచి నష్టపోకుండా ప్రభుత్వం కొబ్బరి చెట్ల బీమా పథకాన్ని అమలు చేస్తోందని తుని ఉద్యానవన శాఖ అధికారి జి.విజయలక్ష్మి తెలిపారు. తేటగుంటలో కొబ్బరి రైతులకు బీమా పథకంపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ బీమా సంస్థ అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా లిమిటెడ్, కోకనట్ బోర్డు 50శాతం, రాష్ట్రప్రభుత్వం 25శాతం మొత్తంగా 75శాతం రాయితీతో కొబ్బరి చెట్ల బీమా పథకం అమలు చేస్తున్నట్లు తెలిపారు. తుపాన్లు, ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టం వాటిల్లితే క్లెయిమ్ వర్తిస్తుందని తెలిపారు. అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ జిల్లా కోఆర్డినేటర్ ఎన్.వరప్రసాద్ మాట్లాడుతూ రైతులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులు, ఉద్యానవ నశాఖ అధికారి జి.విజయలక్ష్మి, ఉద్యానవన శాఖ అసిస్టెంట్ ఎం.సత్యనారాయణ, బీమా సంస్థ జిల్లా కోఆర్డినేటర్ ఎన్.వరప్రసాద్ పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న హార్టికల్చర్ అధికారి

ఏకాభిప్రాయంతో ఏకగ్రీవ ఎన్నిక అభినందనీయం



గొర్రెల సహకార సంఘ కమిటీని సత్కరిస్తున్న యనమల

తుని రూరల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఏకాభిప్రాయంతో ఏకగ్రీవ ఎన్నిక అభినందనీయమని మాజీ మంత్రి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడు అన్నారు. గొర్రెల పెంపకందారుల సహకార సంఘం నూతన కార్యవర్గ అబినందన సభ తేటగుంట టీడీపీ క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం జరిగింది. ముఖ్యఅతిథిగా యనమల రామకృష్ణుడుప్రసంగించారు. అనంతరం సంఘం అధ్యక్షుడు కొయ్యా కేశవ్, పాలకవర్గ సభ్యులను యనమల సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో డైరెక్టర్లు కాపారపు రాము, ఉరుకుట్టు అప్పన్న, రామకేశవరావు, నారాయణమూర్తి, శ్రీనివాసరావు, ఏడుకొండలు, వెంకటేశ్వరరావు, బండి ఉమామహేష్, మట్ట గోవిందరాజు, మల్లేపూడి మురళీకృష్ణ, యలమంచిలి రంగారావు, సాధనాల రాంబాబు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి, శివ కేశవుల ప్రతిష్ఠ రెండో రోజు పూజలు

జగ్గంపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట మండలం ఇర్రిపాక ఏలేరు నదీ తీరాన ఉన్న మల్లికార్జునస్వామి, ప్రసన్న వెంకటేశ్వరస్వామి, శివకేశవుల ఆలయాల వద్ద కోటిలింగేశ్వరుడు, ప్రసన్న వెంకటేశ్వరస్వామి, శివ కేశవుల ప్రతిష్ఠ రెండో రోజు పూజలు ఘనంగా జరిపారు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, మణి దంపతుల ఆధ్వర్యంలో వేదపండితులు పాణింగిపల్లి సత్యపవన్ కుమారాచార్యులు, కామేశ్వరశర్మ కోటి లింగేశ్వరస్వామికి గణపతి పూజ, పుణ్యాహవచనం తదితర పలు కార్యక్రమాలు జరిగాయి. మధ్యాహ్నం గణపతి, చండీ, సర్వదేవతల హోమాలు, సాయంత్రం కోటిలింగేశ్వరస్వామికి పంచగవ్య సహిత జలాధివాసం జరిగాయి. వెంకటేశ్వరస్వామికి విశ్వక్సేన పూజ, పుణ్యాహ వచనం తదితర పలు కార్యక్రమాలు జరిగాయి. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 17న ఏలేరు నదీతీరాన శివకేశవుల ప్రతిష్ఠ వైభవంగా జరుగుతుందన్నారు. తోట సర్వారాయుడు, సునీత దంపతులు, జీను మణిబాబు, భారతీయ ధర్మ పరిషత్ జిల్లా అధ్యక్షుడు పాలచర్ల నాగేంద్ర చౌదరి, రేఖ బుల్లిరాజు, బస్వా చినబాబు సత్యంరాజా, మండపాల అప్పన్నదొర, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు

రీసర్వేను పరిశీలించిన అధికారులు

గండేపల్లి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): యల్లమిల్లిలో జరుగుతున్న రీసర్వేను కాకినాడ అసిస్టెంట్ డైరెక్టర్ కె.శ్రీనివాస్ శుక్రవారం పరిశీలించారు. గ్రామసర్వేయర్లు, రెవెన్యూ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈనెలాఖరుకి సర్వే పూర్తి చేయాలని సూచించారు.

ఎన్నికల ప్రచారం

జగ్గంపేట, ఫిబ్రవరి14(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు మద్దతుగా ప్రచారం చేయాలని జనసేన ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ జన సైనికులను కోరారు. ఎమ్మెల్సీ అభ్యర్థికి ఓటు వేయాలని ప్రచారం చేస్తూ కరపత్రాలు పంచారు.

'బర్డ్ ఫ్లూ'పై అప్రమత్తం

మోతుగూడెం పశువైద్యాధికారి అన్వేష్



మోతుగూడెం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ సీహెచ్ నరసింహులు ఆదేశాలతో ముందస్తు చర్యగా స్థానిక చెక్‌పోస్టు దగ్గర సిబ్బందిని అప్రమత్తం చేశామని మోతుగూడెం పశువైద్యాధికారి డాక్టర్ అన్వేష్ తెలిపారు. మండలంలో ఎక్కడైనా కోళ్ల అసాధారణ మరణాలు సంభవిస్తే రైతులు వెంటనే సచివాలయంలోని పశుసంవర్ధక శాఖ సిబ్బందికి తెలియజేయాలన్నారు. కోడిమాంసం, కోడిగుడ్లను బాగా ఉడికించి వినియోగించడం వల్ల ఎటువంటి సమస్యలు ఉండవన్నారు.

చికెన్ అమ్మవద్దు: రెవెన్యూ అధికారులు

కూనవరం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): బర్డ్ ఫ్లూ వ్యాప్తి నేపథ్యంలో మార్కెట్లో చికెన్ అమ్మవద్దని చికెన్ షాపుల యజమానులకు రెవెన్యూ అధికారులు సూచించారు. మరోవైపు చికెన్ షాపుల్లో అమ్మకాలు తగ్గుముఖం పట్టడంతో యజమానులు డీలా పట్టారు. రెండు, మూడు రోజుల్లో వారికి రెవెన్యూ అధికారులు నోటీసులు ఇవ్వనున్నట్లు తెలిసింది.

నిబంధనల ప్రకారం నిర్వాసితులకు ప్యాకేజీ

రంపచోడవరం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు ముంపు బాధితులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్యాకేజీ అమలు చేస్తామని పోలవరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటివ్ అధికారి వి.అభిషేక్ అన్నారు. పీఎంఆర్‌సీలోని జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో సబ్ కలెక్టర్ కేఆర్ కల్పశ్రీ, ఆర్‌అండ్‌ఆర్ అధికారులు,సిబ్బందితో సమావేశం నిర్వహించారు. చింతూరు డివిజన్‌లోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీల నిర్మాణ పనులను ఆగస్టు నెలలో వచ్చే వరదలకు ముందుగానే పూర్తి చేయాలని ఆదేశించారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అంబేద్కర్, తహసీల్దారు కరక సత్యనారాయణ, డిప్యూటీ తహసీ ల్దారు త్రిమూర్తులు, సీనియర్ అసిస్టెంట్ దాసు పాల్గొన్నారు.

అడవిరాజులుబాబు పండుగ

రాజవొమ్మంగి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ముర్లవానిపాలెంలో అడవి రాజులుబాబు పండుగ చేసుకున్నారు. గ్రామానికి చెందిన సోముల పెదగంగమ్మ, ఇరటా అప్పలరాజు ఆధ్వర్యంలో డప్పులతో అడవిరాజులు వేషాలతో చిన్నారులు గ్రామమంతా తిరిగారు. ఇళ్ల ముందు నీటితో వారధిగా వేసి పూజలు చేశారు. అక్కడి నుంచి సమీప గ్రామంలో ఉన్న అడవిరాజులు గుడికి వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అన్నదానం జరిపారు.

జాతరలో రెండు వర్గాల మధ్య ఘర్షణ

పలువురు యువకులకు గాయాలు
కానిస్టేబుల్‌కు స్వల్పగాయం

తుని రూరల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): తేటగుంటలో జరిగిన అడవి రాజులు బాబు జాతరలో ఏర్పాటుచేసిన రికార్డింగ్ డ్యాన్స్‌లో రెండు వర్గాల యువకుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఇది కాస్తా పెద్దదిగా మారి రాళ్లతో ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడంతో పలువురు గాయపడ్డారు. దీన్ని అదుపు చేసేందుకు వెళ్లిన తునిరూరల్ పోలీస్‌స్టేషన్ కానిస్టేబుల్‌కు స్వల్ప గాయాలైనట్లు తెలిసింది. గురువారం రాత్రి జరిగిన ఘటనపై పోలీసులు రెండు వర్గాల యువకులను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

మాతృ ప్రేమతో పరిపాలనే ఇండియన్ ప్రజా కాంగ్రెస్ ఆశయం

అన్నవరం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మాతృప్రేమతో పరిపాలనే ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ ప్రధాన ఆశయమని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు కేబీ శ్రీధర్ పేర్కొన్నారు. పార్టీ ఆరవ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం సత్యదేవుడి సన్నిధిలో పార్టీ పేరున పూజలు చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ త్వరలో రెండు తెలుగు రాష్ట్రాల్లో పర్యటించి తమ పార్టీ పంచ సూత్రాలను ప్రజల్లోకి వెళతామన్నారు. కార్యక్రమంలో నాదెండ్ల సుధాకర్, అంజనీ, పద్మిని పాల్గొన్నారు.

యనమలకు ఆహ్వానం

జగ్గంపేట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఇర్రిపాకలో ఏలేరు నదీతీరాన 17న శివకేశవుల ప్రతిష్ఠను ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ దంపతులు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ దంపతుల ఆధ్వర్యంలో వైభవంగా జరగనుంది. ఈ సందర్భంగా టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు యనమల రామకృష్ణుడుకు ఆలయ కమిటీ ఆహ్వాన పత్రిక అందించారు.

ప్రభుత్వ భూమిలో విద్యుత్ స్తంభాలు పాతాలి

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఒమ్మంగి నుంచి ఉత్తరకంచి వరకు వేస్తున్న త్రీ ఫేజ్ విద్యుత్ లైను సవరించి ప్రభుత్వ భూమిలో విద్యుత్ స్తంభాలు పాతాలని స్థానిక రైతులు ములికి చంద్రయ్య, సుంకర ధర్మరాజు కోరుతున్నారు. ఒమ్మంగి నుంచి గోపాలుడు చెరువు వరకు రోడ్డుకు ఆనుకుని పంట కాలువ ఉందని, కాలువ గట్టుకు ఆనుకుని విద్యుత్ స్తంభాలు వేస్తే రైతులకు నష్టం ఉండదన్నారు. దీనిపై విద్యుత్ శాఖ డీఈకి ఫిర్యాదు చేసినా ఫిర్యాదు తీసుకోలేదని రైతులు ఆరోపిస్తున్నారు. పనులను అడ్డుకుంటే చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరిస్తున్నారని వారు వాపోయారు.

ఉపాధి వేతనాలు ఇప్పించరూ..

శంఖవరం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): గత ఏడాది సెప్టెంబరు, అక్టోబరులలో నిలిచిపోయిన ఉపాధి వేతనాలు ఇప్పించాలని ఎంపీడీవో శర్మకు మాసంపల్లి, జగన్నాథపురం ఉపాధి కూలీలు వేడుకున్నారు. దీనిపై శర్మ మాట్లాడుతూ ఉపాధి సోషల్ ఆడిట్‌లో తలెత్తిన సాంకేతిక ఇబ్బందుల కారణంగా వేతనాలు నిలిచిపోయింది వాస్తవమేనని తెలిపారు. ఈనెలలో మళ్లీ ప్రతిపాదనలు పంపుతామని త్వరలో వారికి వేతనాలు వచ్చేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కూలీలు, గ్రామపెద్దలు, రామ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



ప్రత్తిపాడులో కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థికి ప్రచారం చేస్తున్న దృశ్యం

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడులో శుక్రవారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం చేశారు. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ఆధ్వర్యంలో నియోజకవర్గ పరిశీలకుడు గొంప కృష్ణ, కాకినాడ పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు కొమ్ముల కన్నబాబు ప్రచారం చేశారు. ఈసందర్భంగా పరిశీలకుడు గొంప కృష్ణ మాట్లాడారు. అనంతరం ఎమ్మెల్సీ కరపత్రాలను ఆవిష్కరించి పంపిణీ చేశారు. కార్యక్రమంలో పోలిశెట్టి శ్రీను, మదినే దొరబాబు, కొండపల్లి శ్రీను, మూరా చిన్ని తదితులు పాల్గొన్నారు.